STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 357 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శనివారం 28 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

విద్యుత్ రంగానికి కేంద్రం
అండగా నిలవాలి



- రూ.25,096 కోట్ల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలి
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి సాయం ఇవ్వాలి
- రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

మత్తుపై మహా పోరు..
కదిలిన మహానగరం!


- ముగిసిన మూడు రోజుల 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- ముగింపు సభకు శ్రీశ్రీ రవిశంకర్, మెగాస్టార్ చిరంజీవి హాజరు
- దాదాపు 40 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర



జిమ్ కోచ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

- మహిళపై నిందితుడు లైంగిక దాడి
- ఫ్లాట్‌లోకి చొరబడి వేధింపులు
- ఫోన్, సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్
- రూ.8 వేల జరిమానా విధించిన కోర్టు

2



నిరంతర గస్తీతో నేరాలకు అడ్డుకట్ట!

డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నేర సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్

3





తిండికి కొరత లేదు..
నీటికే కటకట!



ప్రతి అంగుళం భూమికీ పక్కా లెక్క!

- రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- మండలానికి రెండు సర్వే బృందాలు
- తెలంగాణ భూ రీసర్వే దేశానికే ఆదర్శం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

2

- రాష్ట్రంలో తీవ్రంగా నీటి సమస్య
- ఎనిమిది నెలలపాటు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- హైడ్రాతో జలవనరులను పరిరక్షిస్తున్నాం
- కాంక్రీట్ అరణ్యంగా మారిన హైదరాబాద్
- డ్రగ్స్, ఆహార కల్తీని ఉపేక్షించేది లేదు
- పరిశుభ్రత లేని హోటళ్లను సీజ్ చేయాలి
- వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు పదేళ్ల కార్యాచరణ
- వాతావరణ మార్పుల సదస్సు సన్నాహక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు కొరత లేకపో యినప్పటికీ నీటి సమస్య తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశా రు. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే ఎనిమిది నెలలపాటు అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన వాతావరణ మార్పుల సదస్సు సన్నాహక కార్యక్రమంలో సీ ఎం మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉ ందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. సమస్త జీవరాశిని కాపాడే శక్తి, బాధ్యత రైతులపై ఉందన్నారు. ఒకప్పుడు తెలంగాణలో చెరువులు పుష్కలంగా ఉండేవని, కాలక్రమేణా అవి ఆక్రమణలకు గురయ్యాయని సీఎం పేర్కొన్నారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని జలవనరులను పరిరక్షించడంతో పాటు కబ్జాలకు గురైన చెరువులను పునరుద్ధరిస్తున్నామని వెల్లడించారు.

మిగతా 2 లో

మహిళా, డీలిమిటేషన్ బిల్లులకు కేబినెట్ ఓకే

చట్టసభల్లో 33 శాతం మహిళా కోటా, 50 శాతం సీట్ల పెంపు

ఈ నెల 30 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశం

4



బిల్లుకు ఆమోదం రాకపోతే..
జనాభా ప్రకారమే సీట్ల పెంపు

- ప్రాంతీయ విభేదాలు సృష్టించడం సరికాదు
- ఉత్తరాది ఆందోళనకు దిగితే పరిస్థితి ఏమిటి?
- బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

2



నేడు విపక్షాల భేటీ 4

హెచ్ఎండీఏకు షాక్



కోకాపేట, మూసాపేట భూముల వేలంలో నిరాశ

కోట్ల విలువైన భూములు.. వేలానికి బిడ్డర్లు కరువు!

2

రెండు విడతల్లోనూ ఒక్క బిడ్ కూడా దాఖలు కాని వైనం

హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో మందగమనంపై చర్చ

సదాశివపేట మున్సిపాలిటీలో
ఏసీబీ దాడులు



- రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇద్దరు అధికారులు

.. వివరాలు 3లో

ఒకే వర్గానికి పెద్దపీట!




- కొలీజియంలో ప్రతిభ, వైవిధ్యాన్ని విస్మరిస్తున్నారని ఆరోపణ
- జోక్యం కోరుతూ రాష్ట్రపతి ముర్ముకు మాజీ సీజేఐ గవాయ్ లేఖ

4

బెంగాల్ ప్రతిపక్ష నేత నియామకం రద్దు

- టీఎంసీ రెబల్ నేత రితబ్రతకు హైకోర్టు షాక్
- 10 రోజుల్లో తాజా ఉత్తర్వులివ్వాలని స్పీకర్‌కు ఆదేశం
- మమతా బెనర్జీ వర్గానికి భారీ ఊరట

4



తిండికి కొరత లేదు.. నీటికే కటకట!

మొదటి పేజీ తరువాయి

చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవడం సరికాదన్నారు. హైదరాబాద్ నగరం కాంక్రీట్ అరణ్యంగా మారిపోయిందని, చుక్క నీరు కూడా భూమిలోకి ఇంకకుండా కాంక్రీట్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంట వ్యవధిలో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసినా నగరం జలమయమవుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఫలితాలను మనం అనుభవించకపోయినా భావితరాలు పొందుతాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నివారణ తర్వాత ఆహార కల్తీ నియంత్రణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందుకోసమే టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేశామని, ఎంతటి పెద్ద హోటల్‌నైనా తనిఖీ చేసే అధికారాలను ఆ సంస్థకు కల్పించామని వెల్లడించారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లను వెంటనే సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల కార్యాచరణ రూపొందిస్తోంది. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సులో ప్రత్యేకంగా వాతావరణ మార్పుల సదస్సును ఏర్పాటు చేయనుంది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం, జల భద్రత, కరువు నివారణ, వాతావరణ అనుకూల వ్యవసాయం, హరిత వృద్ధి అనే ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఈ సదస్సు ద్వారా 2026–2036 తెలంగాణ వాతావరణ స్థితిస్థాపకత కార్యాచరణ రూపకల్పనకు పునాది వేయనున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత స్పందించే విధానానికి బదులుగా ముందస్తు సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రభుత్వ శాఖల సమన్వయంతో వాతావరణ సవాళ్లను ఎదుర్కొనే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ సీఎం అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు



శ్రీశ్రీ రవిశంకర్, సేంద్రీయ వ్యవసాయ నిపుణుడు చింతల వెంకట్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క తదితరులు పాల్గొన్నారు.



కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ట్రక్ పార్క్ భూముల వేలంపై దాఖలైన పిటిషన్లు కొట్టివేత

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి తెలంగాణ హైకోర్టులో లైన్ క్లియర్ అయింది. ఈ భూముల వేలాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ నిర్వహించ తలపెట్టిన ఈ-వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది. కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని దాదాపు 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు లేదా సంస్థలకు విక్రయించవద్దని, ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా ఉంచాలని కోరుతూ కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త మాధవరం కాంతారావుతో పాటు ట్రక్ పార్క్ అసోసియేషన్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ప్రజాప్రయోజనం కోసం సేకరించిన ఈ భూమికి కంచె వేసి రక్షించాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. ఇరుపక్షాల వాదనలను పరిశీలించింది. ఈ పిటిషన్లలో ఎలాంటి ప్రజా ప్రయోజనం కనిపించడం లేదని న్యాయస్థానం స్పష్టం చేస్తూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ట్రక్ యజమానులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో, హెచ్ఎండీఏ అధికారిక షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత సమయానికి ఈ-వేలం నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేసింది. ఈ భూమి విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

హెచ్ఎండీఏకు షాక్

కోకాపేట, మూసాపేట భూముల వేలంలో నిరాశ

కోట్ల విలువైన భూములు.. వేలానికి బిడ్డర్లు కరువు!

హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో మందగమనంపై చర్చ

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): హైదరాబాద్‌లో ఎప్పుడూ హాట్ కేకుల్లా అమ్ముడయ్యే కోకాపేట, మూసాపేట భూములకు ఈసారి గట్టి షాక్ తగిలింది. హెచ్ఎండీఏ నిర్వహించిన భూముల ఈ-వేలంలో కనీసం ఒక్క బిడ్ కూడా దాఖలు కాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు ఇక్కడ భూమి దక్కించుకోవడానికి బడా రియల్టర్లు, ఇన్వెస్టర్లు పోటీ పడి వందల కోట్లు కుమ్మరించేవారు. కానీ తాజాగా ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా వేలం నిర్వహించినా ఒక్క బిడ్డర్ కూడా ముందుకు రాలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో హెచ్ఎండీఏ అధికారులు ఈ-వేలాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు నిర్ణయించిన భారీ కనీస ధరలే ఇన్వెస్టర్లను వెనక్కి తగ్గేలా చేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వేలంలో భాగంగా మూసాపేట ట్రక్ పార్క్ వద్ద ఉన్న 3.15 ఎకరాల భూమికి ఎకరా కనీస ధరను రూ.99 కోట్లుగా ఫిక్స్ చేశారు. ఇక అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూమికి ఎకరా కనీస ధర ఏకంగా రూ.120 కోట్లుగా నిర్ణయించారు. అయితే ఈ స్థాయిలో ధరలు పెట్టి భూములు కొనుగోలు చేసేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు, ఇన్వెస్టర్లు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. నిజానికి హెచ్ఎండీఏ వేలానికి ఇలాంటి చేదు అనుభవం ఎదురుకావడం ఇది కొత్తేమీ కాదు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని హుడా హైట్స్ భూములకు నిర్వహించిన ఈ-వేలాన్ని కూడా సరైన స్పందన లేకపోవడంతో అధికారులు వాయిదా వేయాల్సి వచ్చింది. వరుసగా ఖరీదైన ప్రాంతాల్లోని భూముల వేలానికి ఇన్వెస్టర్లు దూరంగా ఉండటం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనానికి అద్దం పడుతోంది. మరి ఈ పరిస్థితుల్లో హెచ్ఎండీఏ కనీస ధరలను తగ్గించి మళ్లీ వేలం నిర్వహిస్తుందా లేదా అనేది చూడాలి.

జిమ్ కోచ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు



హైదరాబాద్: ఫిట్‌నెస్ శిక్షణ కోసం జిమ్‌కు వచ్చే మహిళపై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం ఆమెను బెదిరిస్తూ వేధించిన కోచ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్ జిమ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో నిందితుడు మహ్మద్ మౌజం అలీకి ఎల్బీనగర్‌లోని 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేసింది. దీంతోపాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.వాణి తీర్పు వెలువరించారు. గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్ జిమ్‌లో మహ్మద్ మౌజం అలీ కోచ్‌గా పనిచేసేవాడు. ఆ జిమ్‌కు వ్యాయామం కోసం వచ్చే ఓ మహిళపై అతడు కన్నేశాడు. 2015లో జిమ్‌లోని మహిళల టాయిలెట్‌లో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కూడా బాధితురాలిని వదలకుండా వేధింపులకు దిగాడు. ఆమె నివాస ఫ్లాట్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించి భయపెట్టాడు. బాధితురాలి ఫోన్‌తోపాటు సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి, వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు 2017లో రాయదుర్గం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అవసరమైన ఆధారాలు సేకరించి మహ్మద్ మౌజం అలీని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు విచారణ సందర్భంగా పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిపై నమోదైన నేరాన్ని నిర్ధారించింది. సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వాణి తీర్పు ప్రకటించారు. రూ.8 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించారు. వ్యాయామం, ఆరోగ్య పరిరక్షణ కోసం జిమ్‌లను ఆశ్రయించే మహిళల భద్రతకు సంబంధించిన ఈ ఘటనలో వెలువడిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన శిక్షకుడే వేధింపులకు పాల్పడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అంగుళం భూమికీ పక్కా లెక్క!

- **ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే**
- **భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**
- **మండలానికి రెండు సర్వే బృందాలు**
- **తెలంగాణ భూ రీసర్వే దేశానికే ఆదర్శం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): రాష్ట్రంలో తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన సమగ్ర భూ రీసర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచి, ఏడాదిన్నర వ్యవధిలో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తొలి విడతలో భూముల మ్యాపులు అందుబాటులో లేని 373 గ్రామాల్లో సర్వే ప్రారంభించామని, డిసెంబర్ నెలాఖరుకు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. రీసర్వేను సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు. ఒక్కో సమావేశం నాలుగు నుంచి ఆరు గంటలపాటు కొనసాగిందని, భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు, సరిహద్దు వివాదాలు, రైతుల అభ్యంతరాలపై చర్చించామని తెలిపారు. కొలతల్లో తేడాలు గుర్తించినప్పుడు రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రైవేటు భూముల వివాదాల్లో ప్రభుత్వం ఎవరి పక్షానా నిలవకుండా చట్టబద్ధంగా వ్యవహరిస్తుందని, ప్రభుత్వ భూముల విషయంలో అధికారిక రికార్డుల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సర్వే నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దండోరా ద్వారా ప్రజలకు సమాచారం అందిస్తామని మంత్రి తెలిపారు. కొలతలు పూర్తయిన అనంతరం భూ యజమానులకు విస్తీర్ణ వివరాలను తెలియజేసి అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. న్యాయబద్ధమైన అభ్యంతరాలను పరిశీలించి రికార్డుల్లో అవసరమైన మార్పులు చేస్తామని చెప్పారు. సర్వే ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమగ్ర భూ రీసర్వే పూర్తయిన తర్వాత రైతులకు ఆధునిక సాంకేతికతతో రూపొందించిన కొత్త పాస్ పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని పొంగులేటి వెల్లడించారు. చిరిగిపోకుండా, నీటికి దెబ్బతినకుండా దీర్ఘకాలం మన్నేలా వీటిని రూపొందిస్తామన్నారు. ప్రతి పాస్ పుస్తకానికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయిస్తామని, దాన్ని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, మ్యాప్ తదితర వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఒకే యజమానికి చెందిన వేర్వేరు సర్వే నంబర్లలోని భూముల వివరాలను ఒకే పాస్ పుస్తకంలో ప్రత్యేక పేజీల్లో పొందుపరుస్తామని తెలిపారు. వ్యవసాయ భూములతోపాటు గ్రామాల్లోని నివాస స్థలాలు, ఇళ్లు, ఆబాదీ ఆస్తులకు కూడా సమగ్ర సర్వే చేపడతామని మంత్రి వెల్లడించారు. చిన్న స్థలం ఉన్నవారికైనా మ్యాప్‌తో కూడిన ఆస్తి గుర్తింపు పత్రాన్ని అందిస్తామన్నారు. వ్యవసాయ భూములకు ఒక రంగులో, నివాస ఆస్తులకు మరో రంగులో ప్రత్యేక పాస్ పుస్తకాలు జారీ చేసే ప్రతిపాదన ఉందని చెప్పారు. గతంలో మండలానికి ఒక సర్వే బృందం మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్యను రెండుకు పెంచినట్లు తెలిపారు. తొలి దశలో ఎదురైన సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలను అధిగమించి తదుపరి విడతల్లో సర్వేను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకరించాలని కోరారు. ఇళ్ల కేటాయింపులో తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని పొంగులేటి ఆరోపించారు. రాష్ట్రానికి 13 లక్షల ఇళ్లు కేటాయించాలని కోరితే కేవలం రెండు లక్షల ఇళ్లే మంజూరు చేశారని విమర్శించారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 17 లక్షల ఇళ్లు కేటాయించారని, తాజాగా ఏపీకి నాలుగు లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష సాధింపు ధోరణి లేదని, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యమైనా శాస్త్రీయంగా, నిజాయతీగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ రంగానికి కేంద్రం అండగా నిలవాలి

- **రూ.25,096 కోట్ల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలి**
- **పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి సాయం ఇవ్వాలి**
- **రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



న్యూఢిల్లీ, నవంబర్ 27 (సమయం న్యూస్): తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసార, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్‌లో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, వ్యవసాయ ఫీడర్ల సౌరీకరణ, ప్రభుత్వ విద్యుత్ బకాయిల చెల్లింపు, విద్యుత్ నిల్వ సామర్థ్యం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద రూ.25,096 కోట్ల విలువైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను ఈ ఏడాది మే 27న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించినట్లు భట్టి తెలిపారు. ఈ పథకం కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.72 కోట్ల బడ్జెట్ సహాయం మాత్రమే అందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపడంతోపాటు పనుల అమలుకు 2028 మార్చి 31 వరకు గడువు కల్పించాలని కోరారు. దేశంలో 92 గిగావాట్ అవర్ల విద్యుత్ నిల్వ సామర్థ్యం కోసం రూ.14,500 కోట్ల ఆర్థిక సహాయం అందించాలన్న కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్ని భట్టి స్వాగతించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం ఆర్థిక సహాయం అందే అవకాశం లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. టీజీజెన్‌కో చేపట్టనున్న కల్వూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం తెలపడంతోపాటు రాష్ట్రంలో టెండర్ల దశలో ఉన్న 2,000 మెగావాట్ అవర్ల బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సహాయం అందించాలన్న విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల్లో భారీ హెచ్చుతగ్గులు రాష్ట్రాల ఆర్థిక ప్రణాళికపై ప్రభావం చూపుతున్నాయని భట్టి పేర్కొన్నారు. తెలంగాణకు కేటాయించిన 5,801 మెగావాట్ల నెట్‌వర్క్ యాక్సెస్‌లో మార్పు లేకపోయినా 2025 అక్టోబర్‌లో రూ.195 కోట్లు, నవంబర్‌లో రూ.145 కోట్ల ప్రసార ఛార్జీలు విధించారని వివరించారు. రాష్ట్రాల వారీగా ఛార్జీల లెక్కింపును ప్రతి నెలా వెల్లడించాలని, వార్షిక ప్రాతిపదికన ఛార్జీలను నిర్ణయించాలని కోరారు. ఇప్పటికే చెల్లించిన బిల్లులను తిరిగి లెక్కించి అదనపు ఛార్జీలు విధించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. దక్షిణాదికి 6 వేల మెగావాట్ల విద్యుత్‌ను అందించే రాయ్‌గఢ్–పుగళూర్–త్రిస్సూర్ హెచ్‌వీడీసీ ప్రసార వ్యవస్థకు పూర్తిస్థాయి జాతీయ హోదా కల్పించాలని కోరారు. తెలంగాణలో 23,480 ఎంవీఏ సామర్థ్యం కలిగిన హరిత విద్యుత్ కారిడార్ ప్రాజెక్టులకు తొలి విడతలోనే ఆమోదం తెలపాలన్నారు. సేడం–పరిగి విద్యుత్ ప్రసార లైన్, మహేశ్వరం–2 సబ్‌స్టేషన్‌ను అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ప్రాజెక్టులుగా చేపట్టి, వాటి వ్యయాన్ని జాతీయ స్థాయిలో పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అంతర్రాష్ట్ర ప్రసార ఛార్జీల మినహాయింపును 2030 మార్చి 31 వరకు పొడిగించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి గతేడాదితో పోలిస్తే సుమారు 20 శాతం తగ్గగా, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి 13.3 శాతం పెరిగిందని భట్టి వివరించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్‌లో 56 కోట్ల యూనిట్ల విద్యుత్ కొరత నమోదైందన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 2027 ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు దేశంలోని అన్ని గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను వినియోగించేలా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన గ్యాస్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతోపాటు అదనపు వ్యయాన్ని ఏ ఒక్క రాష్ట్రంపైనా మోపకుండా ఉమ్మడి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

బిల్లుకు ఆమోదం రాకపోతే..

జనాభా ప్రకారమే సీట్ల పెంపు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): డీలిమిటేషన్ అంశంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాబోయే డీలిమిటేషన్‌కు సంబంధించి పార్లమెంట్‌లో డిసెంబర్ నాటికి బిల్లు ఆమోదం పొందకపోతే, ఆ తర్వాత సీట్ల పెంపు ప్రక్రియను జనాభాకు అనుగుణంగానే చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉత్తరాది ప్రజలు తమ జనాభా నిష్పత్తి ప్రకారమే డీలిమిటేషన్ చేయాలని ఆందోళనలు ప్రారంభిస్తే పరిస్థితి ఏంటని లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రస్తుతం కొందరు దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విభేదాలు, తారతమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రానికి ఒకే ఎంపీ ఉన్న పరిస్థితులను కూడా గమనించాలని సూచించారు. జీడీపీని ప్రాతిపదికగా తీసుకుని ఎంపీ సీట్లను పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రతిపాదనను లక్ష్మణ్ ప్రశ్నించారు. జీడీపీ అనేది ప్రతి ఏటా మారుతూ ఉంటుందని, అలాంటప్పుడు ఎంపీ సీట్లను కూడా ప్రతి సంవత్సరం పెంచడం లేదా తగ్గించడం సాధ్యమేనా అని నిలదీశారు. సాధారణంగా డీలిమిటేషన్ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి జరుగుతుందని గుర్తుచేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా ప్రాతినిధ్యం, రిజర్వ్‌డ్ స్థానాలు పెరుగుతాయని... తద్వారా ఆయా వర్గాల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని లక్ష్మణ్ వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో అడ్డుకున్న కాంగ్రెస్, వామపక్షాలు, మమతా బెనర్జీలకు ప్రజలు ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.



నిరంతర గస్తీతో నేరాలకు అడ్డుకట్ట!

- డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలి
- నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- కామారెడ్డి పోలీసుల పనితీరుపై డీజీపీ ప్రశంసలు
- నేర సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్



కామారెడ్డి, నవంబర్ 27 (సమయం న్యూస్): క్షేత్రస్థాయిలో పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి గస్తీ పెంచాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన నగదును తిరిగి రాబట్టడంలో, పోక్సో సహా వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో కామారెడ్డి పోలీసులు చూపుతున్న పనితీరును అభినందించారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూడున్నరేళ్లపాటు విధులు నిర్వహించిన అనుభవాలను గుర్తుచేసుకున్న డీజీపీ.. అప్పట్లో నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సమష్టి కృషితో మూడు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ పోలీసులకు ప్రధాన సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో కామారెడ్డి జిల్లాకు సరిహద్దులు ఉండటంతో అంతర్రాష్ట్ర నేర ముఠాల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ఏటా 10 నుంచి 15 ముఠాలు జిల్లాలో సంచరించేవని, వాటి కట్టడికి చేపట్టిన ఆపరేషన్ కవచ్ మంచి ఫలితాలనిస్తోందని తెలిపారు. 2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ స్థాయి వరకు మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల బాధితుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకుంటూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని డీజీపీ హెచ్చరించారు. సుమారు 40 రకాల సైబర్ మోసాల ద్వారా ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతోపాటు నగదు రికవరీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కామారెడ్డి పట్టణంలో మరో పోలీస్‌స్టేషన్‌తోపాటు బాన్సువాడలో అదనపు పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తులో సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఫిట్‌కాప్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను ఎస్పీ రాజేష్ చంద్ర వివరించారు. జిల్లాకు 1,158 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 976 మంది విధులు నిర్వహిస్తున్నారని, 182 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన నగదులో 2024లో 55 శాతం, 2025లో 69 శాతం, 2026 నవంబర్ నాటికి 61 శాతం రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 7,285 మొబైల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు అందగా, 3,683 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా ఏడో స్థానంలో ఉందన్నారు. కామారెడ్డి టౌన్, దేవునిపల్లి, బాన్సువాడ, బిచ్కుంద, బిక్కనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే జిల్లా మొత్తం నేరాల్లో 42 శాతం నమోదవుతున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 25 ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. బాన్సువాడలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మతపరమైన ఘర్షణలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ నాటికి అక్రమ ఇసుక రవాణాపై 193 కేసులు నమోదు చేసి 281 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ గేమింగ్‌పై 376 కేసులు నమోదు చేయడంతోపాటు 135 రౌడీషీట్లు తెరిచినట్లు వివరించారు. సమావేశంలో కొత్త నేర చట్టాల అమలు, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు, సామాజిక మాధ్యమాలపై నిఘా తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐజీ కార్తికేయ, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, జోన్--3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపై మహా పోరు.. కదిలిన మహానగరం!

- ముగిసిన మూడు రోజుల 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- దాదాపు 40 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర
- రాజకీయాలకు అతీతంగా మాదకద్రవ్యాలపై పోరాటం
- యువత భవిష్యత్తును కాపాడటం అందరి బాధ్యత
- ముగింపు సభకు శ్రీశ్రీ రవిశంకర్, మెగాస్టార్ చిరంజీవి





హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా హైదరాబాద్‌లో చేపట్టిన 'నషా ముక్త్ భారత్' మూడు రోజుల పాదయాత్ర శుక్రవారం ముగిసింది. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి దాదాపు 40 కిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్నారు. 2029 నాటికి మాదకద్రవ్యాల రహిత భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పానికి మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని, దేశంలోని దాదాపు 70 కోట్ల మంది యువత భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా వారి ఆశయాలను సాకారం చేసుకునేందుకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పాదయాత్రకు హైదరాబాద్ ప్రజల నుంచి లభించిన విశేష స్పందన మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి మరింత బలాన్నిచ్చిందని తెలిపారు. ముగింపు సభకు హాజరైన ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ మానసిక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యకర జీవన విధానం ప్రాధాన్యాన్ని వివరించారు. ఆయన మార్గదర్శనం మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి తన జీవిత అనుభవాలను పంచుకుంటూ స్నేహితుల ప్రభావంతో ప్రారంభమయ్యే దురలవాట్లు క్రమంగా వ్యసనాలుగా మారి వ్యక్తుల భవిష్యత్తుతో పాటు కుటుంబాల జీవితాలను కూడా నాశనం చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, ప్రముఖ దర్శకుడు సుకుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ వడ్డించే వంటగదిలో ఇంత అపరిశుభ్రతా!

కరీంనగర్‌లోని క్లాసిక్ అభిరుచి రెస్టారెంట్ లైసెన్స్ సస్పెన్షన్

ఆహార భద్రతా అధికారుల తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు

శీతలీకరణ యంత్రంలో గడ్డకట్టిన మాంసపు రక్తం

నిమ్మకాయలపై బూజు.. బిర్యానీలో ఆహార రంగులు



కరీంనగర్, నవంబర్ 27 (సమయం న్యూస్): ప్రజారోగ్యానికి ముప్పు కలిగించేలా ఆహార పదార్థాలను తయారు చేస్తూ, తీవ్ర అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహిస్తున్న కరీంనగర్ వావిలాలపల్లిలోని క్లాసిక్ అభిరుచి మల్టీ క్యూజిన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌పై ఆహార భద్రతా అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనలకు సంబంధించి 14 ఉల్లంఘనలను గుర్తించారు. వాటి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని రెస్టారెంట్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ (13621002000175)ను తక్షణమే నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చి గుడ్లతో మయోనైజ్ తయారు చేయడం, బిర్యానీతో పాటు ఇతర వంటకాల తయారీలో ఆహార రంగులు వినియోగించడం, నిమ్మకాయలపై బూజు పెరగడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. మాంసాన్ని అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో నిల్వ చేయడంతో పాటు శీతలీకరణ యంత్రం అడుగుభాగంలో పాత మాంసం నుంచి కారిన రక్తం గడ్డకట్టినట్లు వెల్లడించారు. సుమారు 30 కిలోల ఆహార, మాంస పదార్థాలను ఎలాంటి గుర్తింపు లేకుండా నిల్వ చేసినట్లు తెలిపారు. పన్నీర్‌పై లేబుళ్లు లేకపోవడం, పలు ఆహార పదార్థాలను మూతలు లేకుండా బహిరంగంగా ఉంచడాన్ని గుర్తించారు. వంటగదిలోని ఫ్యాన్లపై దుమ్ము, ఎగ్జాస్ట్ ఫ్యాన్లపై మసి పేరుకుపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. మురుగునీటి కాలువలు మూసుకుపోవడం, నేల దెబ్బతినడం, కూరగాయలు కోసే పలకలు అపరిశుభ్రంగా ఉండటం వంటి లోపాలు బయటపడ్డాయి. మరుగుదొడ్లకు ఆనుకుని పాత్రలు, వంట పరికరాలు ఉంచడంతో అవి కలుషితమయ్యే ప్రమాదముందని తెలిపారు. ఆహార తయారీ సిబ్బంది చేతి తొడుగులు, తలకు రక్షణ కవచాలు ధరించకపోవడాన్ని కూడా గుర్తించారు. ప్రజారోగ్యానికి ఏర్పడే ముప్పును దృష్టిలో ఉంచుకుని సస్పెన్షన్ కాలంలో రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం, పంపిణీ, వడ్డన పూర్తిగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కేవలం నిబంధనలు పాటించినట్లు నివేదిక సమర్పించినంత మాత్రాన రెస్టారెంట్‌ను తిరిగి ప్రారంభించరాదని, సంబంధిత అధికారి నుంచి లిఖితపూర్వక అనుమతి పొందిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభించాలని కరీంనగర్ ఆహార భద్రతా విభాగం వెల్లడించింది.



లోటస్ పాండ్ పార్కు స్థలంపై వివాదం..

పనులను అడ్డుకున్న స్థానికులు

హైదరాబాద్, నవంబర్ 27: నగరంలోని ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన జూబ్లీహిల్స్‌లోని లోటస్ పాండ్ సమీప పార్కు స్థలంపై వివాదం నెలకొంది. వేల కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడానికి సిద్ధమైందని, పోలీసు బందోబస్తు మధ్య అభివృద్ధి పనులు చేపడుతోందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని చెట్లను తొలగించి, జేసీబీలతో స్థలాన్ని చదును చేస్తుండటంతో కాలనీవాసులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అధికారుల చర్యలకు నిరసనగా ఆందోళన చేపట్టడంతో ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ వ్యవహారంపై స్థానికులతో కలిసి పోరాడుతున్న మాజీ ఐపీఎస్ అధికారి యోగానంద్ ప్రభుత్వ చర్యలను ప్రశ్నించారు. ఈ నెల 24న ప్రధాన దినపత్రికల మొదటి పేజీల్లో ప్రభుత్వం ప్రకటన ఇచ్చి, లోటస్ పాండ్ సమీపంలోని సుమారు 10,150 గజాల స్థలాన్ని వేలం వేయనున్నట్లు వెల్లడించిందని తెలిపారు. గతంలోనూ ఈ భూమిని విక్రయించేందుకు ప్రయత్నించగా తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని గుర్తుచేశారు. అప్పట్లో ఈ స్థలాన్ని పార్కుగా మాత్రమే అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం కోర్టుకు స్పష్టమైన హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. న్యాయస్థానానికి ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఇప్పుడు మళ్లీ వేలం ప్రక్రియ చేపట్టడంపై యోగానంద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. వేలం ప్రకటనలో స్థలానికి 40 గజాల రోడ్డు ఉన్నట్లు చూపించారని, వాస్తవానికి అక్కడ రోడ్డు లేదని ఆరోపించారు. ప్రస్తుతం స్థలాన్ని చదును చేసి కొత్తగా రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం ఉన్నట్లు ప్రకటనలో వివరించారని, కానీ లోటస్ పాండ్ నుంచి వచ్చే అదనపు నీరు నేరుగా ఈ స్థలంలోకి చేరి నిలుస్తోందని వివరించారు. పార్కు స్థలాన్ని వాణిజ్య అవసరాలకు మళ్లించి విక్రయించే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. చెట్ల తొలగింపు, స్థలాన్ని చదును చేసే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగుతున్న పనులపై స్థానికుల నిరసన నేపథ్యంలో ఈ వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది.

సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇద్దరు అధికారులు



సదాశివపేట, నవంబర్ 27: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రూ.15 వేల లంచం తీసుకుంటూ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం సదాశివపేట మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాజేష్ కుమార్ (ఏవో-1), ఔట్‌సోర్సింగ్ విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివారెడ్డి (ఏవో-2) లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. 2025లో గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఉబా చెరువులో చేపట్టిన పూడికతీత పనులకు సంబంధించి రూ.4.50 లక్షల కాంట్రాక్ట్ బిల్లును ఇప్పటికే మంజూరు చేసి ప్రాసెస్ చేసినందుకు ప్రతిఫలంగా ఏవో-1 రాజేష్ కుమార్ ఫిర్యాదుదారుడిని రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడించింది. అనంతరం ఆ మొత్తాన్ని భద్రపరిచేందుకు ఏవో-2 శివారెడ్డికి అప్పగించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్ము రూ.15 వేలను ఏవో-2 శివారెడ్డి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అధికారులు తమ విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు పాల్పడినట్లు ఏసీబీ పేర్కొంది. అనంతరం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది.

సంపాదకీయం



డీలిమిటేషన్ పోరు..
మారుతున్న రాజకీయ లెక్కలు!

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ బిల్లులు మరోసారి పార్లమెంటు వేదికగా రసవత్తర చర్చకు తెరలేపుతున్నాయి. శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఈ రెండింటికీ ఆమోదముద్ర వేయడంతో, నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే ప్రత్యేక సమావేశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2029 నుంచి మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్యను 850కి పెంచేలా కేంద్రం కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఏప్రిల్ 17న ఓటింగ్‌లో ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో, ఈసారి 'మిషన్ 360' కోసం కేంద్రం వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండగా, ప్రాంతీయ, విపక్ష పార్టీల వైఖరుల్లో కదలికలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ఏప్రిల్ అనుభవం.. సంఖ్యాబలం లెక్కలు

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభకు హాజరై ఓటు వేసే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. ఏప్రిల్ 17న 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అవసరమైన 352 ఓట్ల మార్కుకు కేంద్రం 54 ఓట్ల దూరంలో ఆగిపోయింది. ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది పూర్తిస్థాయిలో హాజరైతే సుమారు 360 ఓట్లు అవసరమవుతాయి. కొందరు ఎంపీలు గైర్హాజరైతే ఈ మార్క్ కొంత తగ్గే అవకాశం ఉంది. కేంద్ర వర్గాల అంచనా ప్రకారం ప్రస్తుతం ఎన్డీయేకు 319 మంది ఎంపీల మద్దతు ఉంది. ఇందులో బీజేపీ (241), టీఎంసీ నుంచి బయటకు వచ్చి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిన 20 మంది ఎంపీలతో పాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఉన్నారు. శరద్ పవార్ ఎన్‌సీపీ (8), డీఎంకే (22) అండగా నిలిస్తే ఆ సంఖ్య 350కి చేరుతుంది. అయినా 360 మార్కు కోసం మిగిలిన పది ఓట్ల సమీకరణపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది.

టీఎంసీ తిరుగుబాటు ఎంపీల ఓట్లపై చర్చ

బిల్లు ఆమోదంలో టీఎంసీకి చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీల ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. లోక్‌సభలోని 28 మంది టీఎంసీ ఎంపీల్లో 20 మంది జూన్‌లో ఎన్‌సీపీఐలో విలీనమవుతున్నట్లు ప్రకటించి ఎన్డీయేకు మద్దతిచ్చారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వీరిపై అనర్హత వేటు వేయాలని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా నిర్ణయం వెలువడలేదు. స్పీకర్ అధికారికంగా అనర్హులుగా ప్రకటించేంత వరకు వారికి ఓటు హక్కు ఉంటుందని లోక్‌సభ సచివాలయ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆ 20 మంది వేసే ఓట్లను చట్టబద్ధంగా పరిగణించవచ్చా అని ప్రశ్నించారు.

డీఎంకే షరతులు.. స్టాలిన్ స్పష్టత

కాంగ్రెస్‌తో విభేదించి ఇండియా కూటమి నుంచి వైదొలిగిన డీఎంకే వైఖరి కీలకంగా మారింది. అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచేలా కేంద్రం బిల్లు సవరించిందన్న ప్రచారంతో డీఎంకే మద్దతివ్వొచ్చన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే మద్దతు కోసం ఆ పార్టీ రెండు షరతులు విధించింది. 50 శాతం సమాన పెంపుతో పార్లమెంటులో తమిళనాడుకున్న 7.18 శాతం వాటా (ప్రస్తుతం 39 సీట్లు, పెంపుతో 59 అవుతాయి) తగ్గకూడదని, 1971 జనాభా లెక్కల ప్రకారం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తిని మరో 25 ఏళ్లు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. వీటిపై నోటిమాట హామీ కాకుండా బిల్లు ముసాయిదాలోనే చేర్చాలని పట్టుబడుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రధాన డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గబోమని డీఎంకే అధినేత స్టాలిన్ శుక్రవారం స్పష్టం చేశారు. మీడియా ఊహాగానాలు, వెన్నుపోటుదారుల విమర్శలు తమ సంకల్పాన్ని కదిలించలేవని, పదవుల కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టిన వారిపై పరోక్షంగా మండిపడ్డారు. 50 శాతం సమాన పెంపు ఫార్ములా ప్రతిపాదించినా, సీట్ల సంఖ్య పరంగా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుందన్న ఆందోళన రాజకీయ వర్గాల్లో ఇంకా కొనసాగుతోంది.

శరద్ పవార్ పార్టీలో భిన్న స్వరాలు

ఎనిమిది మంది ఎంపీలు ఉన్న ఎన్‌సీపీ (శరద్ పవార్ వర్గం) నుంచి శుక్రవారం భిన్న సంకేతాలు వెలువడ్డాయి. శరద్ పవార్‌తో భేటీ అనంతరం ఎమ్మెల్యే జితేంద్ర అవ్హాడ్ మాట్లాడుతూ.. డీలిమిటేషన్ రాజ్యాంగపరమైన అవసరమని పవార్ భావిస్తున్నారని, బిల్లుకు తమ పార్టీ మద్దతిస్తుందని ప్రకటించారు. అయితే ఎంపీ సుప్రియా సూలే దీనికి భిన్నంగా స్పందించారు. బిల్లు ముసాయిదా పరిశీలించాకే అధికారిక వైఖరి వెల్లడిస్తామని, గుడ్డిగా వ్యతిరేకించడం లేదా సమర్థించడం సరికాదని అన్నారు. డీహైడ్రేషన్‌తో పవార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున శనివారం ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి భేటీకి తన స్థానంలో ఎంపీ నీలేశ్ లంకే హాజరవుతారని ఆమె తెలిపారు. ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసింది.

విపక్షాల వ్యూహంపై సర్వత్రా ఆసక్తి

ప్రత్యేక సమావేశాలకు ముందు అధికార, విపక్ష శిబిరాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్రాల సీట్ల వాటాకు భంగం కలగని సవరణలతో విస్తృత మద్దతు కూడగట్టాలని కేంద్రం ప్రయత్నిస్తుండగా, శనివారం భేటీ అవుతున్న ఇండియా కూటమి రచించే ఉమ్మడి వ్యూహంపై ఆసక్తి నెలకొంది. డీఎంకే, ఎన్‌సీపీ తుది నిర్ణయాలు, టీఎంసీ తిరుగుబాటు ఎంపీల ఓట్లు, మిగిలిన పది ఓట్ల సమీకరణమే 'మిషన్ 360' భవితవ్యాన్ని తేల్చనున్నాయి.

మహిళా, డీలిమిటేషన్ బిల్లులకు కేబినెట్ ఓకే

- చట్టసభల్లో 33 శాతం మహిళా కోటా, 50 శాతం సీట్ల పెంపు
- ఏ రాష్ట్రం వాటా తగ్గకుండా బిల్లులో కీలక సవరణలు
- ఈ నెల 30 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశం
- 'మిషన్ 360'పై ఎన్డీయే గురి.. శనివారం ఇండి కూటమి భేటీ



న్యూఢిల్లీ, నవంబర్ 27 (సమయం న్యూస్): నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన 'సేవా తీర్థ్'లో శుక్రవారం జరిగిన ప్రత్యేక భేటీలో కేబినెట్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుతో పాటు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో వీటిని ప్రవేశపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పునర్విభజన తర్వాత ఏ రాష్ట్రమూ తన లోక్‌సభ సీట్ల నిష్పత్తిని కోల్పోకుండా బిల్లులో కేంద్రం కీలక సవరణలు చేసినట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం మేర సీట్లు పెరిగేలా, జనగణనతో సంబంధం లేకుండానే పునర్విభజన ప్రక్రియ చేపట్టేలా విధివిధానాల్లో మార్పులు చేసింది. ఈ బిల్లు ద్వారా ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచాలని ప్రతిపాదిస్తోంది.

'మిషన్ 360'.. సంఖ్యాబలంపై ఎన్డీయే కసరత్తు

ఈ ఏడాది ఏప్రిల్‌లో డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టగా, తగిన సంఖ్యాబలం లేక వీగిపోయింది. ఈసారి ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలని పట్టుదలగా ఉన్న మోదీ సర్కారు 'మిషన్ 360' లక్ష్యంతో పావులు కదుపుతోంది. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో సభకు హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో మూడు ఖాళీగా ఉన్నాయి. స్పీకర్ మినహా 539 మంది హాజరైతే బిల్లు గట్టెక్కడానికి 360 మంది మద్దతు అవసరం. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు గతంలో 293 మంది ఎంపీలు ఉండగా, ఇటీవల టీఎంసీ నుంచి చీలిన 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి ఎన్డీయేకు మద్దతు ప్రకటించారు. శివసేనఉయూబీటీకి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేరడంతో ఎన్డీయే బలం 319కి పెరిగింది. అంటే మరో 41 మంది ఎంపీల మద్దతు అవసరం.

మారుతున్న వైఖరి.. కలిసొచ్చే సమీకరణాలు

అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే నిబంధనపై కేంద్రం సంకేతాలివ్వడంతో గతంలో బిల్లును వ్యతిరేకించిన డీఎంకే, ఎన్‌సీపీఉఎస్పీ పార్టీలు సానుకూలంగా స్పందిస్తున్నాయి. 50 శాతం పెంపుపై లిఖితపూర్వక హామీ ఉంటే మద్దతుకు అభ్యంతరం లేదని ఎన్‌సీపీఉ ఎస్పీ నేత సుప్రియా సూలే స్పష్టం చేయగా, తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.2 శాతం వాటాను కొనసాగిస్తే మద్దతిస్తామని డీఎంకే చెబుతోంది. ఈ రెండు పార్టీలకు కలిపి 30 మంది ఎంపీలు ఉన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్, వైసీపీ (నలుగురు ఎంపీలు), యూపీపీఎల్ (ఒక ఎంపీ) మద్దతు తోడైతే ఎన్డీయే బలం 354 దాటుతుంది. దీనికి తోడు సభలో హాజరు సమీకరణాలు కూడా కేంద్రానికి కలిసొస్తున్నాయి. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ సస్పెన్షన్‌లో ఉండగా, ఎంపీలు అమృత్‌పాల్ సింగ్, షేక్ రషీద్ జైలులో ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ ఆగా రుహుల్లా రాజీనామా చేశారు. వీరు నలుగురూ ఓటింగ్‌లో పాల్గొనలేరు. ఎంఐఎం, ఏఎస్పీ, జెడ్పీఎం పార్టీల ముగ్గురు ఎంపీలు, ముగ్గురు స్వతంత్రుల్లో కొందరు గైర్హాజరైనా మెజారిటీ మార్క్ మరింత తగ్గి బిల్లు సులువుగా గట్టెక్కే అవకాశం ఉంది. ఉభయ సభల్లో తమకు సరిపడా సంఖ్యాబలం ఉందని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

శనివారం ఇండి కూటమి వ్యూహరచన

మరోవైపు విపక్ష ఇండి కూటమి ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పార్లమెంటులో బిల్లును అడ్డుకునేందుకు ఉమ్మడి వ్యూహం రచించేందుకు కూటమి నేతలు శనివారం సమావేశం కానున్నారు. ఈ బిల్లులు మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటుండగా, నియోజకవర్గాల పునర్విభజనపై వివిధ రాష్ట్రాలు, విపక్షాల స్పందనపై ఉత్కంఠ నెలకొంది.

డీలిమిటేషన్‌పై నేడు విపక్షాల భేటీ

- ఉదయం 11.30కి ఇండి కూటమి వ్యూహరచన
- ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్
- రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించిన జైరాం రమేశ్
- రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీ లేదన్న స్టాలిన్



న్యూఢిల్లీ, నవంబర్ 27 (సమయం న్యూస్) : పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లును ఎదుర్కొనేందుకు విపక్ష ఇండి కూటమి అప్రమత్తమైంది. సభలో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఇండి కూటమి, ఇతర విపక్ష పార్టీలు శనివారం ఉదయం 11.30 గంటలకు సమావేశం కానున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని కేంద్రం దేశ ప్రజలకు పెద్ద ఉచ్చు పన్నేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. డీఎంకే రాజ్యాంగానికి కట్టుబడి ఉంటుందన్న ఆయన, ఈ భేటీ కోసం అన్ని ప్రతిపక్ష పార్టీలను సంప్రదిస్తున్నామని వెల్లడించారు. మరోవైపు, ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ తన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు విప్ జారీ చేసింది. నవంబర్ 29 నాటికి అందరూ ఢిల్లీకి చేరుకోవాలని ఆదేశించింది.

రాజ్యాంగంపై దాడి: జైరాం రమేశ్

లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాన్ని రాజ్యాంగంపై జరిగిన దాడిగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభివర్ణించారు. తయారీ పరిశ్రమను పునరుద్ధరించడంలో విఫలమైన మోదీ ప్రభుత్వం ఆందోళనతో చేస్తున్న నిస్సహాయ చర్యగా ఈ ప్రత్యేక సెషన్‌ను పేర్కొన్నారు. మోదీఉషా జోడీ మరోసారి అబద్ధాలు చెబుతోందని ఆయన ఆరోపించారు. 2023 సెప్టెంబర్‌లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం మహిళా రిజర్వేషన్ కోసం కాదని, బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా నియోజకవర్గాల పునర్విభజన కోసమేనని విమర్శించారు. మరో 25 ఏళ్ల పాటు లోక్‌సభ ఎంపీల సంఖ్యను ఇలాగే కొనసాగిస్తూ, 2029 ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు కోటా కల్పించాలన్నదే కాంగ్రెస్ స్పష్టమైన వైఖరని స్పష్టం చేశారు.

మద్దతిచ్చేవారు దేశద్రోహులే: సంజయ్ రౌత్

ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు దేశ, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనదని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ మండిపడ్డారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన ప్రభుత్వం లోక్‌సభ సభ్యుల సంఖ్యను 860కి పెంచి పునర్విభజన చేపట్టాలని యోచిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేసేవారు చరిత్రలో దేశద్రోహులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీ లేదు: స్టాలిన్

లోక్‌సభలో తమిళనాడుకు ఉన్న ప్రాతినిధ్య వాటాను కాపాడాలని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎటువంటి రాజీకి తావులేదని డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. పునర్విభజన వల్ల కలిగే ప్రమాదాలపై తొలుత గళమెత్తింది డీఎంకేనే అని, సరైన పద్ధతిలో ప్రక్రియ జరగాలని దేశవ్యాప్త నేతలు చెన్నైలోనే ఏకమై డిమాండ్ చేశారని గుర్తుచేశారు. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిచ్చి డీఎంకే చారిత్రక తప్పిదం చేయదని వీసీకే అధినేత తిరుమావళవన్ విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిల్లును ఓడించేందుకు టీవీకే, కాంగ్రెస్, ఇతర ఇండి కూటమి భాగస్వామ్య పక్షాలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సీపీఐ వ్యతిరేకత.. భేటీకి సుప్రియ దూరం

మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం ఆమోదయోగ్యం కాదని, ప్రతిపాదిత బిల్లును తాము వ్యతిరేకిస్తామని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. మహిళా కోటాకు తాము మద్దతిచ్చామని, వైఖరిలో మార్పు చేసుకున్న పార్టీలు వివరణ ఇవ్వాలని కోరారు. మరోవైపు, డీలిమిటేషన్ బిల్లు ముసాయిదాను గానీ, ప్రత్యేక సమావేశాల ఎజెండాను గానీ ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదని ఎన్‌సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. తన తండ్రి శరద్ పవార్ ఆసుపత్రిలో ఉన్నందున శనివారం జరిగే ఇండి కూటమి సమావేశానికి తాను హాజరుకాలేకపోతున్నానని తెలిపారు

కొలీజియంలో ఒకే వర్గానికి పెద్దపీట!

జోక్యం కోరుతూ రాష్ట్రపతి ముర్ముకు మాజీ సీజేఐ గవాయ్ లేఖ

న్యూఢిల్లీ, నవంబర్ 27 (సమయం న్యూస్) : ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు సిఫార్సులు చేసే కొలీజియం వ్యవస్థ ప్రతిభ, సర్వసమావేశకత (ఇన్‌క్లూసివ్‌నెస్) సూత్రాలను పూర్తిగా విస్మరిస్తోందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఆరోపించారు. ఇతరులను పక్కనపెట్టి సమాజంలోని ఒక ప్రత్యేక వర్గానికే సిఫార్సుల్లో ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొంటూ ఆయన శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఇటీవలి నియామకాలు, బదిలీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. హైకోర్టులు, సుప్రీంకోర్టులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల తక్కువ ప్రాతినిధ్యంపై జోక్యం చేసుకోవాలని కోరారు. తాను కొలీజియం సభ్యుడిగా, సీజేఐగా ఉన్నప్పుడు వైవిధ్య సూత్రాలను పాటించానని తెలిపారు.గత 75 ఏళ్లుగా సుప్రీంకోర్టు స్వరూపంలో పెద్దగా మార్పు రాలేదని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలతో పాటు ఇతర అగ్రవర్ణాలనూ పక్కనపెట్టి ఒకే వర్గం పట్టు సాధించిందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. 2018 నుంచి నియమితులైన 715 మంది హైకోర్టు న్యాయమూర్తుల్లో కేవలం 22 మంది ఎస్సీలు, 16 మంది ఎస్టీలు, 89 మంది ఓబీసీలు, 37 మంది మైనారిటీలు మాత్రమే ఉన్నారని గణాంకాలతో వివరించారు. 2021ఉ2026 మధ్య నియామకాల్లో అగ్రవర్ణాల వాటా దాదాపు 80 శాతంగా ఉండగా, జనాభాలో 40ఉ50 శాతం ఉన్న ఓబీసీలకు 14 శాతానికి లోపే వాటా దక్కిందన్నారు. దేశ జనాభాలో 5 శాతానికి లోపు ఉన్న ఒక వర్గానికి సుప్రీంకోర్టులో 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం ఉందని, ఇది ఇటీవల మరింత పెరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బెంగాల్ ప్రతిపక్ష నేత నియామకం రద్దు

10 రోజుల్లో తాజా ఉత్తర్వులివ్వాలని స్పీకర్‌కు ఆదేశం

కోల్‌కతా, నవంబర్ 27 (సమయం న్యూస్): పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ, చీఫ్ విప్‌గా ఎమ్మెల్యే అఖ్ఖుజ్జమాన్ నియామకాలను కలకత్తా హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. అసెంబ్లీ స్పీకర్ రథీంద్ర బోస్ తీసుకున్న నిర్ణయం చట్టబద్ధంగా సమర్థనీయం కాదని స్పష్టం చేసిన జస్టిస్ కృష్ణారావు ఏకసభ్య ధర్మాసనం.. ఈ అంశాన్ని పునఃపరిశీలించి, 10 రోజుల్లోగా సహేతుక కారణాలతో తాజా ఉత్తర్వులు జారీ చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో మమతా బెనర్జీ వర్గానికి భారీ ఊరట లభించింది. మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమితో మమత 15 ఏళ్ల పాలనకు తెరపడగా, ఆ తర్వాత టీఎంసీలో భారీ చీలిక ఏర్పడింది. మే 6న 70 మంది ఎమ్మెల్యేలు సీనియర్ నేత శోభన్‌దేవ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా ఎన్నుకోగా, సంతకాలు ఫోర్జరీ చేశారంటూ రితబ్రత స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం 59 మంది ఎమ్మెల్యేలతో 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరిట వేరుపడిన రితబ్రతను జూన్ 3న స్పీకర్ ప్రతిపక్ష నేతగా గుర్తించారు. దీనిని సవాల్ చేస్తూ శోభన్‌దేవ్ కోర్టును ఆశ్రయించారు. జులైలో డివిజన్ బెంచ్ ఇచ్చిన రెండు నెలల మధ్యంతర గడువు అక్టోబర్ 18న ముగిసినా, వారు ప్రభుత్వ సౌకర్యాలు అనుభవిస్తున్నారని ఆయన మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అనంతరం హైకోర్టు రెబల్ నేతల నియామకాలను కొట్టివేసింది. మరోవైపు టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తుపై మమత, రితబ్రత వర్గాల మధ్య నెలకొన్న వివాదంపై కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం తొలి విచారణ చేపట్టింది.



పరిగి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం





- **జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో**

పరిగి మున్సిపల్, నవంబర్,27(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ద్వారా పరిగి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నం.1లో "బాల్య వివాహ ముక్త్ భారత్" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మెహర్ ఉన్నిసా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలికల విద్యా ప్రాముఖ్యత, బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలనలో సమాజం పోషించాల్సిన పాత్ర తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలికలకు విద్యను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు.బాల వివాహ భారత్ కార్యక్రమాన్ని ఉద్దేశించి చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ రాజ నాయక్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను, భవిష్యత్తు పైన ప్రభావం గురించి చెప్పటం జరిగింది. ఎక్కడైనా 18 సంవత్సరాల పిల్లలు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటూ కనిపిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 కి ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలని మరియు ఈ నెంబర్ కి ఫోన్ చేసిన వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుంది అని విద్యార్థులకు చెప్పటం జరిగింది.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది వరలక్ష్మి, రాందాస్, బాబు,స్థానిక ASI గోపాల్ గౌడ్,సాధన NGO కోఆర్డినేటర్ నర్సింహులు, ఐసీపీఎస్ సిబ్బంది షఫీ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశీ–తమిళ సంగమం 5.0కు ఏర్పాట్లు

- **వారణాసిలో నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12 వరకు నిర్వహణ**

న్యూఢిల్లీ, నవంబర్ 27:

కాశీ-తమిళ సంగమం (KTS) ఐదో విడతను ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ నవంబర్ 28న వారణాసిలో ప్రారంభించనున్నారు. డిసెంబర్ 12 వరకు జరిగే ఈ కార్యక్రమానికి 1,400 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. ముగింపు కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు.ఈ ఏడాది సంగమం ప్రధాన అంశం "తిరుక్కురళ్ పయిల్వోమ్ - తిరుక్కురళ్ అభ్యాస్ కరేన్" (తిరుక్కురళ్‌ను నేర్చుకుందాం). తమిళనాడు-కాశీ మధ్య ఉన్న శతాబ్దాల నాటి సాంస్కృతిక, భాషా, నాగరికత సంబంధాలను మరింత బలోపేతం చేయడం కార్యక్రమం లక్ష్యం.

తమిళనాడుకు చెందిన ప్రతినిధులు ఏడు విభాగాల్లో పాల్గొంటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు-మీడియా ప్రతినిధులు, వ్యవసాయ రంగం, వృత్తి నిపుణులు-కళాకారులు, మహిళలు, ఆధ్యాత్మిక నాయకులు ఇందులో ఉన్నారు. వారణాసితో పాటు ప్రయాగ్‌రాజ్, అయోధ్యలను కూడా ప్రతినిధులు సందర్శిస్తారు. తిరుక్కురళ్‌పై దేశవ్యాప్తంగా 1,000 ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంపికైన విద్యార్థులకు నెలరోజుల విద్యా-పరిశోధన కార్యక్రమంలో రూ.10,000 స్టైపెండ్ అందించనున్నారు.ఉత్తరప్రదేశ్ పాఠశాలల్లో తిరుక్కురళ్‌పై అవగాహన కల్పించేందుకు తమిళనాడుకు చెందిన 50 మంది ఉపాధ్యాయులు పాల్గొంటారు. అలాగే BHUలో జాతీయ స్థాయి తిరుక్కురళ్ సదస్సు, సాంస్కృతిక కార్యక్రమాలు, కళాకారుల-చేనేత ప్రదర్శనలు నిర్వహించనున్నారు.తిరుక్కురళ్‌లోని 1,330 ద్విపదలను 22 షెడ్యూల్డ్ భాషల్లో అందుబాటులోకి తెచ్చే బహుభాషా యాప్, ఆడియోబుక్స్, యానిమేషన్ వీడియోల ద్వారా కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనున్నారు.

ఇన్వెస్ట్ తెలంగాణ, ఖేలో ఇండియా కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- **విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు: సీఎస్ సంజయ్ జాజు**

హైదరాబాద్, నవంబర్ 27:

డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఈ కార్యక్రమాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 8న భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షోలను, డిసెంబర్ 11న జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవాన్ని విద్యార్థులు పెద్ద సంఖ్యలో వీక్షించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, రక్షణ రంగ ప్రగతి, పెట్టుబడి అవకాశాలు, క్రీడా స్ఫూర్తిపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలు ఉపయోగపడతాయని సీఎస్ తెలిపారు. విద్యార్థుల రవాణా కోసం అవసరమైనన్ని బస్సులను ఏర్పాటు చేసి, ప్రయాణం, భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని TGSRTC, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సమీకరణకు మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సైదులును నోడల్ అధికారిగా నియమించారు.ఖేలో ఇండియా ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష



సుమారు 8,000 మంది క్రీడాకారులు పాల్గొనే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని సీఎస్ స్పష్టం చేశారు. క్రీడాకారులకు వసతి, రవాణా, భద్రత, వైద్య సహాయం, పారిశుద్ధ్యం, హౌస్‌కీపింగ్, క్రీడా సామగ్రి, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. క్రీడా పోటీలకు విస్తృత మీడియా కవరేజీ కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, సంక్షేమ శాఖల కార్యదర్శులు, స్పోర్ట్స్ అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో 27% రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి





హైదరాబాద్, నవంబర్ 27

చట్టసభల్లో ఓబీసీ, బీసీలకు రాజ్యాంగబద్ధంగా 27 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.బీసీలకు విద్య, ఉద్యోగాల్లో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని, లోపాలు తలెత్తినప్పుడు న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. బీసీల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే అసెంబ్లీ, శాసనమండలి, పార్లమెంట్ ఉభయ సభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు."ఎవరి వాటా మాకు అక్కర్లేదు.. మా వాటా మాకు కావాలి" అనేది యావత్ బీసీ సమాజం సంకల్పమని ఈటల పేర్కొన్నారు.

దేశ జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీల ఆత్మగౌరవం, ఆకాంక్షలను ఈ సమావేశం ప్రతిబింబించిందన్నారు.

బీసీల 27 శాతం రాజకీయ రిజర్వేషన్ డిమాండ్‌ను చట్టసభల్లో ప్రవేశపెట్టి, తప్పని సరిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

- **విద్యార్థులతో కలిసి భోజనం చేసిన అడిషనల్ కలెక్టర్**
- **పాఠశాలలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచన**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 27:-

విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పిస్తూ, పాఠశాల పరిసరాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు.శుక్రవారం సదాశివపేట మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.అనంతరం పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించారు.పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల తదితర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌కు సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, శుభ్రమైన వాతావరణం ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన పరిసరాలు, అహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ పాఠశాల నిర్వహణను బాధ్యతాయుతంగా చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ అనిత, సదాశివపేట ఎంఈఓ, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.



మంథని కళాశాల శిలాఫలకంపై ఎంపీ అభ్యంతరం

- **సీఎస్‌కు లేఖ రాసిన గడ్డం వంశీకృష్ణ**

పెద్దపల్లి, నవంబర్ 27:

మంథని ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల భవనం ప్రారంభోత్సవ శిలాఫలకంపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల పేర్లు లేకపోవడంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు .ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు నవంబర్ 26న లేఖ రాసినట్లు తెలిపారు. శిలాఫలకాన్ని నిబంధనల ప్రకారం సరిదిద్ది, ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రుల పేర్లు చేర్చాలని కోరినట్లు సమాచారం.అలాగే ఈ వ్యవహారంపై పరిపాలనా స్థాయిలో పరిశీలన జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరినట్లు తెలిసింది. మంథని కార్యక్రమం నేపథ్యంలో ఎంపీ వంశీకృష్ణ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మధ్య రాజకీయ విభేదాలపై కూడా చర్చ జరుగుతోంది. అయితే శిలాఫలక వివాదంపై పూర్తి వివరాలు, సంబంధిత అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడంతో పాటు ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొనసాగాలని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

హైదరాబాద్ మార్కెట్లలో కుళ్లిన చేపలు

- **టీజీ సేఫ్ తనిఖీల్లో భారీగా కుళ్లిన చేపలు స్వాధీనం**
- **రాంనగర్‌లో రెండు చేపల దుకాణాలకు క్లోజర్ నోటీసులు**
- **ఫార్మాలిన్ వినియోగంపై అనుమానం.. ల్యాబ్‌కు నమూనాలు**

హైదరాబాద్ నవంబర్27



హైదరాబాద్‌లోని బేగంబజార్, రాంనగర్, ముషీరాబాద్ చేపల మార్కెట్లలో టీజీ సేఫ్ అధికారులు, వెటర్నరీ అధికారులతో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మానవ వినియోగానికి పనికిరాని భారీ మొత్తంలో కుళ్లిన చేపలను గుర్తించి స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.బేగంబజార్‌లోని ఓ చేపల దుకాణంలో 70 కిలోల, రాంనగర్‌లో 65 కిలోల, ముషీరాబాద్‌లో 30 కిలోల చేపలను అధికారులు తొలగించారు. మరో దుకాణంలో 35 కిలోల తిలాపియా చేపలు కూడా గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన రాంనగర్‌లోని రెండు దుకాణాలకు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. చేపలను తాజాగా కనిపించేలా చేసేందుకు ఫార్మాలిన్, నైట్రేట్ వంటి రసాయనాలు ఉపయోగించారా అనే కోణంలో అధికారులు పరీక్షలు చేపట్టారు. చేపల నమూనాలను స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీకి పంపించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు లేకుండా, అపరిశుభ్ర పరిస్థితుల్లో చేపలు విక్రయిస్తున్న వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు.కుళ్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని టీజీ సేఫ్ అధికారులు హెచ్చరించారు.

వైకుంఠ ద్వార దర్శనాల టికెట్లు, టోకెన్ల విడుదల వివరాలు

తిరుమల, నవంబర్ 27

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29 వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి వివిధ దర్శన టికెట్లు, టోకెన్ల విడుదల తేదీలను టీటీడీ ప్రకటించింది.నవంబర్ 28: ఉదయం 10 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్ల కోటా విడుదల.నవంబర్ 30: ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల. డిసెంబర్ 1-5: స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల కోసం భక్తులు ఈడిప్‌లో నమోదు చేసుకోవచ్చు.డిసెంబర్ 7: మధ్యాహ్నం 3 గంటలకు ఈడిప్ ద్వారా టోకెన్ల కేటాయింపు.డిసెంబర్ 8: ఉదయం 10 గంటలకు దాతల దర్శన కోటా టికెట్ల విడుదల.డిసెంబర్ 20, 21న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. ఈ రెండు రోజుల్లో రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కూడా ఉండవు. సాధారణ భక్తులకు అధికంగా దర్శనం కల్పించేందుకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లను ఈడిప్ విధానంలో కేటాయించనున్నారు.భక్తులు దర్శన టికెట్లు, టోకెన్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని టీటీడీ సూచించింది.

గురుకుల విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీస్తాం

మేడ్చల్–మల్కాజిగిరి:

గురుకుల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.తుర్కపల్లిలో గురుకులాల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామగ్రామాన 'ఖేలో ఇండియా' క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణను దేశంలో ప్రముఖ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇస్తున్నామని, గురుకుల విద్యార్థుల పోషకాహారం కోసం డైట్ ఛార్జీలను 40 శాతం పెంచామని చెప్పారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి తల్లిదండ్రులకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్పెషల్ పోలీస్ ఆఫీసర్ డ్రైవర్ల పోస్టులకు దరఖాస్తులు

హైదరాబాద్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (TGiCCC)లో తాత్కాలిక కాంట్రాక్ట్ ప్రాతిపదికన 6 స్పెషల్ పోలీస్ ఆఫీసర్ (డ్రైవర్లు) పోస్టులకు తెలంగాణకు చెందిన మాజీ సైనికులు, మాజీ పారామిలిటరీ సిబ్బంది నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థుల వయస్సు 30112026 నాటికి 58 సంవత్సరాలలోపు ఉండాలి. రెండేళ్లలోపు పదవీ విరమణ చేసిన మాజీ సైనికులు, పారామిలిటరీ సిబ్బందికి గరిష్ట వయోపరిమితి 60 సంవత్సరాలు. చెల్లుబాటు అయ్యే LMV/HMV డ్రైవింగ్ లైసెన్స్, తెలంగాణ నివాస ధృవీకరణ ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 గౌరవ వేతనం చెల్లిస్తారు. దరఖాస్తుతో అవసరమైన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు జతచేయాలి. దరఖాస్తుల స్వీకరణ: 27112026 నుంచి 30112026 సాయంత్రం 5 గంటల వరకు, TGiCCC రిసెప్షన్ సెంటర్, రోడ్ నెం.12, బంజారాహిల్స్. ఫోన్ కాల్స్ అనుమతించబడవు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు వేగవంతం చేయాలి

కొత్తగూడెం నవంబర్27

ఇందిరమ్మ బీమా నమోదు వేగవంతం చేయాలిరుద్రంపూర్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్చుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి లబ్ధిదారుల వివరాల నమోదు, నామినీ వివరాలు, ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు.18 నుంచి 59 ఏళ్ల అర్హులందరూ పథకంలో నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నమోదు అనంతరం లబ్ధిదారులకు రసీదు, ఎన్రోల్‌మెంట్ వివరాలు అందించాలని సూచించారు. రుద్రంపూర్‌లో సుమారు 1,250 రేషన్ కార్డులు ఉండగా, మొదటి రోజు 65 మంది వివరాలు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.అనంతరం నమోదు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు కలెక్టర్ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంపీడీవో లబ్ధిదారులు పాల్గొన్నారు.



విద్య, గృహ రుణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

- బ్యాంకులు లక్ష్యాలను సాధించాలి: అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 27:

విద్య, గృహ రుణాలకు బ్యాంకులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జితేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన రెండో త్రైమాసిక డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆయన బ్యాంకుల రుణాల పురోగతిని సమీక్షించారు.జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2026-27లో రూ.4,81,936.64 కోట్ల లక్ష్యానికిగాను సెప్టెంబర్ 2026 నాటికి రూ.3,34,076.10 కోట్లు (69.32%) రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో రూ.1,33,606.41 కోట్ల లక్ష్యానికి రూ.71,766.62 కోట్లు (53.71%), ప్రాధాన్యతా రంగంలో రూ.1,41,208.94 కోట్లకు రూ.82,367.24 కోట్లు (58.33%) మంజూరయ్యాయని పేర్కొన్నారు.లక్ష్యాలను సాధించని బ్యాంకులు వచ్చే త్రైమాసికంలోగా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం రుణాలు మంజూరు చేస్తున్న బ్యాంకులను అభినందించారు.సమావేశంలో ఎల్‌డీఓ ఆర్‌బీఐ డాక్టర్ ప్రదీప్, నాబార్డ్ డీడీఎం హర్ష రఘురాం, ఎల్‌డీఎం నరసింహమూర్తి, వివిధ బ్యాంకుల నోడల్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాయికోడు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ నవంబర్ 27

రాయికోడు మండల కేంద్రంలో స్మార్ట్ రేషన్ కార్డుల ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేదార్నాథ్ పటేల్ రాయికోడు మేజర్ గ్రామ పంచాయతీ గ్రామ సర్పంచ్ రాధాతుకారం లబ్ధిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారులబ్ధిదారుల పూర్తి వివరాలతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డును ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కేదార్నాథ్ పటేల్ మాజీ యూత్ ప్రెసిడెంట్ ప్రభాకర్ మాజీ సర్పంచ్ వైస్ చైర్మన్ వినయ్ కుమార్ ఉప సర్పంచ్ శివకుమార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పట్లోళ్ల సంగమేశ్వర పటేల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజ్జు పటేల్ యువ నాయకులు శివకుమార్ దుర్గేష్ డీలర్ బక్కప్ప కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ స్కీమ్

- విదేశీ ఉద్యోగాలకు యువతకు 50% ఆర్థిక సాయం

హైదరాబాద్, నవంబర్ 27:

విదేశాల్లో ఉద్యోగాలు పొందాలనుకునే నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ను అమలు చేయనుంది. తొలి ఏడాది 7,000 మందికి ఈ పథకం ద్వారా ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.భాషా శిక్షణ, వీసా, విమాన ప్రయాణ ఖర్చుల్లో 50 శాతం వరకు సబ్సిడీ అందించనున్నారు. పథకంలో మహిళలకు 33.33 శాతం, దివ్యాంగులకు 5 శాతం కేటాయించారు.పథకం అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు





- సైన్స్ ఫెయిర్లు సృజనాత్మకతకు గొప్ప వేదికలు

హైదరాబాద్, నవంబర్ 27:

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచనలను పెంపొందించడంతో పాటు, వారి ఆవిష్కరణ సామర్థ్యాన్ని వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్లు ఎంతో కీలకమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.ఇర్రంమంజిల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 54వ హైదరాబాద్ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలు, ప్రయోగాలను పరిశీలించి వాటి పనితీరు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు.హైదరాబాద్ జిల్లాలో ఐదు విభిన్న కార్యక్రమాల ద్వారా 392 వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం గర్వకారణమని మంత్రి అన్నారు. సైన్స్, సాంఘిక శాస్త్ర విభాగాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 167 ప్రదర్శనలు రూపొందించడం అభినందనీయమన్నారు. INSPIRE MANAKలో 90, ఇతర కార్యక్రమాల్లో సాంకేతిక నమూనాలు, PM SHRI పాఠశాలల నుంచి ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.సైన్స్ ఫెయిర్లు కేవలం పోటీలు, బహుమతులకు పరిమితం కాకుండా, పుస్తకాల్లో నేర్చుకున్న శాస్త్రీయ సూత్రాలను నిత్యజీవిత సమస్యలకు అన్వయించి వినూత్న పరిష్కారాలను కనుగొనే వేదికలని చెప్పారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం, పరిశీలన, ప్రయోగాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.నేటి జీవితంలో భాగమైన కృత్రిమ మేధస్సు, రోబోలు, స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు వంటి ఆవిష్కరణలన్నీ జిజ్ఞాస, పరిశోధన, ప్రయోగాల ఫలితాలేనని పేర్కొన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లలో ఆటలకే పరిమితం కాకుండా విజ్ఞాన అన్వేషణ, సృజనాత్మకత, నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మంత్రి అన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలుగా ఎదిగి తెలంగాణకు, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, సైన్స్ ఆఫీసర్ ధర్మేందర్, ఖైరతాబాద్ తహసీల్దార్ ప్రేమ్ కుమార్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రకు దీక్షా దివస్ చిరస్మరణీయం

- కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు 17 ఏళ్లు..
- ఈ నెల 29న కోస్గిలో కొడంగల్ నియోజకవర్గ స్థాయి సభ
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరు
- కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్

కొడంగల్ మున్సిపల్, నవంబర్,27(సమయం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన చారిత్రాత్మక ఆమరణ నిరాహార దీక్షకు 17 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దీక్షా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్నాయి. తెలంగాణ ఉద్యమ చరిత్రలో నవంబర్ 29వ తేదీకి ప్రత్యేక స్థానం ఉందని, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష ఉద్యమాన్ని కీలక మలుపు తిప్పిందని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గ స్థాయి దీక్షా దివస్ సభను ఈ నెల 29న కోస్గిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.శుక్రవారం కొడంగల్‌లోని తన నివాసంలో కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ విలేకరుల సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2009 నవంబర్ 29న తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారని, పోలీసుల అరెస్టు, నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా 11 రోజులపాటు దీక్షను కొనసాగించారని గుర్తుచేశారు.ఆయన దీక్షతో తెలంగాణ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడానికి ఈ ఉద్యమం కీలక నేపథ్యంగా నిలిచిందని పేర్కొన్నారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు కేసీఆర్ చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందని, ఆయన నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని పదేళ్లపాటు అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ నెల 29న ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కోస్గిలోని లక్ష్మీనరసింహా గార్డెన్‌లో కొడంగల్ నియోజకవర్గ స్థాయి దీక్షా దివస్ సభ నిర్వహించనున్నట్లు వాణిశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు వెల్లడించారు.నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు,అభిమానులు,ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బాకారం అరుణ్, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

- కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు..

రాయపోల్ నవంబర్ 27.(సమయం న్యూస్)

ఇందిరమ్మ బీమా పథకాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని తెల్ల రేషన్ కార్డు కలిగివున్న ప్రతి ఒక్కరు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకంపై గ్రామంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతో ఉందన్నారు. ప్రతి ఇంటికి ఇందిరమ్మ బీమా పథకం రావాలని. ఇందుకు అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు. బీమా పథకం ఉంటే కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గ్రామంలో అర్హులైన పేదలకు అందే విధంగా తాము నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందాలని. రానివారికి



అందించే విధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం పేదలకు ఎంతో వరంగా ఉంటుందని ఈ మంచి పథకాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు. ఇందిరమ్మ ఇండ్లు. గృహజ్యోతి. ఇంటింటికి ఉచిత కరెంటు. మహిళలకు ఫ్రీ బస్సు. మరెన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజాపాలన కొనసాగిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

- ఆదర్శ గ్రామంగా తాజ్‌పూర్.
- బాల్యవివాహాల నిర్మూలనకు కంకణబద్ధం కావాలి.
- ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి.
- సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్.

భువనగిరి నవంబర్ 27 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం గ్రామాభివృద్ధితో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రత ఎంతో కీలకమని తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నవంబర్ 19 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా తాజ్‌పూర్ గ్రామంలో సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండటమే కాకుండా వాటిని తప్పనిసరిగా వినియోగించాలని, బహిరంగ మలవిసర్జనకు



పూర్తిగా స్వస్తి పలకాలని సూచించారు. మరుగుదొడ్డును పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్రతి వినియోగం అనంతరం సబ్బుతో చేతులు కడుక్కోవడం అలవాటు చేసుకోవాలని, తద్వారా కుటుంబ సభ్యులను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని తెలిపారు.బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని, 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని, ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో తాజ్‌పూర్‌ను ఆదర్శ గ్రామంగా నిలపడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సమభావన సంఘాల మహిళలు, గ్రామపెద్దలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కామారెడ్డికి డీజీపీ సి.వి. ఆనంద్‌ఘన స్వాగతం

కామారెడ్డి, నవంబర్ 27:

కామారెడ్డి జిల్లాకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్‌కు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం డీజీపీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా డీజీపీ సి.వి. ఆనంద్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మొక్కలు నాటారు.




‘పడిలేచిన న్యూజిలాండ్’..

రెండో టెస్టులో ముగిసిన తొలిరోజు ఆట



క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 27 (సమయం న్యూస్): క్రైస్ట్‌చర్చ్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసింది. తొలి రోజు పిచ్ బౌలర్లుకు, బ్యాటర్లకు ఇద్దరికీ సమానంగా సహకరించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 246-5 స్కోర్‌తో నిలిచింది. క్రీజులో టామ్ బ్లుండెల్ (53 పరుగులు), గ్లెన్ ఫిలిప్స్ (36 పరుగులు) ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2, అన్షుల్ కాంబోజ్, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్ తలో వికెట్ పడగొట్టారు. జస్ప్రీత్ బుమ్రాకు ఇవాళ ఒక్క వికెట్ కూడా దక్కలేదు. టాస్ నెగ్గిన టీమ్‌ఇండియా, కివీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు టామ్ లేథమ్ (59 పరుగులు), డేవన్ కాన్వే (31 పరుగులు) జట్టుకు మంచి ఆరంభమే ఇచ్చారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించారు. కాన్వేను గుర్నూర్ ఔట్ చేశాడు. అయితే 110 పరుగుల వద్ద కివీస్ మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ లేథమ్‌ను 42వ ఓవర్లో ఆకాశ్ దీప్ వెనక్కిపంపగా, తర్వాతి ఓవర్లో హెన్రీ నికోల్స్ (16 పరుగులు)ను అన్షుల్ పెవిలియన్‌కు చేర్చాడు. 44వ ఓవర్ చివరి బంతికి రచిన్ రవీంద్ర (0) డకౌట్ అయ్యాడు. అతడిని ఆకాశ్ దీప్ ఔట్ చేశాడు. దీంతో కివీస్ 110 పరుగుకు నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. దీన్ని బౌలర్లు అవకాశంగా మల్చుకోవాలని ప్రయత్నించగా, డారిల్ మిచెల్ (31 పరుగులు), టామ్ బ్లుండెల్ క్రీజులో నిలదొక్కుకున్నారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 74 పరుగులు జోడించారు. అద్భుతమైన బంతితో మిచెల్‌ను సుందర్ ఔట్ చేయడంతో ఇవాళే ఆలౌట్ చేసే ఛాన్స్ ఉంటుందని అనిపించింది. కానీ ఈసారి ఫిలిప్స్ (36 పరుగులు) నిలబడిపోయాడు. అజేయంగా ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. దీంతో 246 పరుగుల వద్ద ఇవాళ్టి ఆట ముగిసింది. పేసర్ సిరాజ్‌కు తొలి టెస్టు తుదిజట్టులో చోటు దక్కకపోవడం వివాదంగా మారిన నేపథ్యంలో రెండో మ్యాచ్‌లో జట్టు ఎలా ఉంటుందో అని ఆసక్తి నెలకొంది. మాజీల నుంచి కూడా డిమాండ్లు రావడంతో ఈ టెస్టులో తీసుకుంటారని అంతా భావించారు. కానీ సిరాజ్‌కు రెండో టెస్టులోనూ నిరాశే మిగిలింది. మరోసారి అతడు బెంచ్‌కు పరిమితమయ్యాడు.



ముంబయి చా రాజా

కెప్టెన్‌గా రోహిత్ శర్మ నియామకం

ముంబయి, నవంబర్ 27 (సమయం న్యూస్): 2027 ఐపీఎల్‌కు సంబంధించి ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ కీలక ప్రకటన చేసింది. వచ్చే సీజన్‌లో తమ జట్టు కెప్టెన్సీ బాధ్యతలను మళ్లీ రోహిత్ శర్మకే అప్పగిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు రోహిత్ శర్మను కెప్టెన్‌గా నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా, రీసెంట్‌గానే ముంబయి ఫ్రాంచైజీ రోహిత్‌ను రూ.16 కోట్లకు రిటైన్ చేసుకుంది. మూడేళ్ల విరామం తర్వాత ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబయి ఇండియన్స్ జట్టుకు రోహిత్ తిరిగి సారథ్యం వహించనున్నారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేయడంతో ఖాళీ అయిన కెప్టెన్సీ పగ్గాలను ఫ్రాంచైజీ తిరిగి తమ అత్యంత విజయవంతమైన నాయకుడి చేతికి అప్పగించింది. మరోవైపు జట్టు ప్రధాన కోచ్‌గా కీరన్ పొలార్డ్ నియమితులు కావడంతో రోహిత్, పొలార్డ్ జోడీ మళ్లీ ముంబయిని విజయపథంలో నడిపిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

వైభవ్ సొంత బ్రాండ్ క్రియేట్ చేసుకోవాలి

- క్రిస్ గేల్ ప్రశంసలు!

దోహా, నవంబర్ 27 (సమయం న్యూస్): యూఏఈపై భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడిన తుఫాన్ ఇన్నింగ్స్ చూసి ‘యూనివర్స్ బాస్’ క్రిస్ గేల్ ఆశ్చర్యపోయాడు. ప్రస్తుతం ఇటాలియా టీ10 లీగ్‌లో ఆడుతున్న క్రిస్ గేల్, వైభవ్ ఆటతీరును కొనియాడాడు. వైభవ్ క్రికెట్ స్వరూపాన్నే మార్చేస్తాడని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. ‘మంగళవారం నా ఫోన్ ఏకధాటిగా మోగుతూనే ఉంది. ఏం జరిగిందా? అని చూస్తే, వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర డబుల్ సెంచరీ గురించి తెలిసింది. కేవలం 12 ఓవర్లలోనే ద్విశతకం పూర్తయినట్లు చూసి, మొదట అది టీ20 మ్యాచ్ అనుకున్నాను. కానీ అది వన్డే అని తెలిసి అవాక్కయ్యాను. ఈ కుర్రాడి ఆట చూస్తుంటే త్వరలోనే వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ చేయడం ఖాయమనిపిస్తోంది. ఇతడు క్రికెట్ స్వరూపాన్నే మార్చేస్తాడు’ అని క్రిస్ గేల్ ప్రశంసించాడు. అదే విధంగా ప్రత్యర్థి యూఏఈ అయినంత మాత్రాన ఆ ఇన్నింగ్స్‌ను తక్కువ అంచనా వేయలేమని క్రిస్ గేల్ అన్నాడు. ఏ జట్టుపై అయినా ఆ స్థాయిలో విరుచుకుపడడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ ప్రతిభ తగ్గకుండా మరిన్ని అవకాశాలు రావాలని, అతడిని ఎక్కువ మ్యాచ్‌ల్లో ఆడడం చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తన నిక్‌నేమ్ ‘యూనివర్స్ బాస్’ తరహాలో వైభవ్‌ను ‘బేబీ బాస్’ అని పిలవడంపైనా క్రిస్ గేల్ స్పందించాడు. అతడిని ‘బేబీ బాస్’ అనడం సరికాదన్నారు. అంతకంటే పెద్ద పేరును వైభవ్ సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. అయితే ‘యూనివర్స్’ మాత్రం ఎప్పటికీ తనదేనంటూ చమత్కరించారు. గతంలో రోహిత్ శర్మకు ‘హిట్‌మ్యాన్’, ఏబీ డివిలియర్స్‌కు ‘మిస్టర్ 360’ ఎలాగో వైభవ్ కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, సొంత బ్రాండ్‌ను సృష్టించుకుంటాడని తాను బలంగా నమ్ముతున్నానని క్రిస్ గేల్ అన్నాడు. కాగా, రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టోర్నీలో మంగళవారం యూఏఈపై జరిగిన మ్యాచ్‌లో వైభవ్ మెరుపు ఇన్నింగ్స్‌తో విధ్వంసం సృష్టించాడు. 53 బంతుల్లోనే 204 పరుగులు బాది ఔరా అనిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతడు అనేక రికార్డులు బ్రేక్ చేశాడు. మరోవైపు, వైభవ్ సూర్యవంశీని భారత జట్టు తరఫున రెగ్యులర్‌గా ఆడించాలని, వన్డేల్లోకి వీలైనంత తొందరగా తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కొన్నాళ్లుగా వైభవ్ టీ20 జట్టులో చోటు దక్కించుకుంటున్నా, ఇప్పటివరకు అతడు ఆడింది 10 మ్యాచ్‌లే. ఈ విషయంపై తాజాగా టీమ్‌ఇండియా మాజీ చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ స్పందించాడు. వైభవ్‌ను తీర్చిదిద్దుతున్నామని చెబుతూ ఛాన్స్‌లు మాత్రం ఇవ్వడంలేదని విమర్శించాడు. ‘టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ కొన్ని బలమైన నిర్ణయాలు తీసుకోవాలి. వైభవ్ బిహార్ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి దులీప్ టైటిల్‌ను సాధించాడు. వైభవ్ ఆ స్థాయికి ఎదిగినా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం ఇవేవీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు. సూర్యవంశీని తీర్చిదిద్దుతున్నామని చెబుతూ జట్టు యాజమాన్యం ఒక ఆట ఆడుతోంది. వైభవ్‌కు అవకాశాలు ఇవ్వడం లేదు. మరోవైపు, ఈ కుర్రాడు తనదైన శైలిలో చెలరేగిపోతున్నాడు. ‘వైభవ్ ఎలా ఆడుతున్నాడో చూడు గౌతమ్. అలా ఎవరూ ఆడలేరు. బంతిని ఇలా కొట్టడం ఎప్పుడైనా చూశారా?’ వైభవ్ ఆడిన షాట్లు చూడండి. అతడు అన్ని వైపులా భారీ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. ఇది మరో స్థాయి. క్రికెట్ పుస్తకాల్లో కూడా ఇలాంటి షాట్ల గురించి ప్రస్తావన లేదు. నేను ఇలాంటి షాట్లను ఎప్పుడూ చూడలేదు. ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ కూడా ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించలేదు’ అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు.



‘సిరాజ్ కన్నీళ్లు పెట్టుకున్నాడా?’ మురళీ కార్తీక్ కామెంట్స్




క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 27 (సమయం న్యూస్): న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ మహ్మద్ సిరాజ్‌కు చోటు దక్కలేదు. తొలి మ్యాచ్‌తో పోలిస్తే, ఈ టెస్టులో భారత్ తుదిజట్టులో ఒక మార్పు జరిగినప్పటికీ, సిరాజ్‌కు మాత్రం మరోసారి నిరాశ ఎదురైంది. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో టీమ్ మేనేజ్‌మెంట్ గుర్నూర్ బ్రార్‌ను జట్టులోకి తీసుకుంది. దీంతో సిరాజ్ వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో లైవ్ టీవీ కామెంటేటర్ మాజీ క్రికెటర్ మురళీ కార్తిక్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. జట్టులో చోటు దక్కకపోవడంతో సిరాజ్ ‘భావోద్వేగానికి లోనయ్యాడేమో?’ అని కార్తిక్ వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ అనంతరం సిరాజ్ సన్‌గ్లాసెస్ ధరించి మైదానంలో నడుస్తూ కనిపించాడు. ఈ సమయంలో అతడి ముఖాన్ని గమనించిన మురళీ కార్తీక్, జట్టులో చోటు దక్కకపోవడం వల్ల సిరాజ్ భావోద్వేగానికి లోనయ్యాడేమోనని అన్నాడు. ‘సిరాజ్ ఏడుస్తున్నాడా?’ అని లైవ్ టెలికాస్ట్‌లో కార్తీక్ ప్యానెల్‌లోని మెంబర్లతో అన్నాడు. అయితే సిరాజ్ కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఎక్కడా కనిపించలేదు. కానీ మైదానంలో అతడి ఫేస్ చూస్తుంటే ఎమోషనల్ అయ్యాడేమోనని కార్తిక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. “సాధారణంగానే సిరాజ్ భావోద్వేగపూరితమైన వ్యక్తి. ఇలాంటి నిర్ణయాలు అతనికి బాధ కలిగించవచ్చు. కొందరు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించినప్పుడు వాళ్లు పెద్దగా పట్టించుకోరు. ఇంకొందరు ఎలాగైనా టీమ్‌లో రీ ఎంట్రీ ఇవ్వాలని తపిస్తుంటారు. అలాంటివాళ్లు గాయాలైనా, తలనొప్పిగా ఉన్నా, ఒళ్లు నొప్పులున్నా సరే తమ సర్వస్వాన్ని ధారపోసి ఆడతారు. సిరాజ్ కూడా అలాంటి బౌలరే అనిపిస్తుంది. ఎందుకంటే, కొన్నిసార్లు ఆటగాళ్లు తమ గాయాలను బయటకు చెప్పుకోకుండా దాస్తారు. వన్డే సిరీస్‌ల్లో కూడా సిరాజ్‌ను బెంచ్‌కే పరిమితం చేశారు. వెస్టిండీస్‌తో సిరీస్‌లోనూ, చివరి మ్యాచ్‌లో ఎట్టకేలకు అతడికి అవకాశం ఇచ్చారు. ఇలాంటివి ఒక ఆటగాడికి బాధ కలిగిస్తాయి. అతని గణాంకాలు కూడా గొప్పగా ఉన్నాయి. మరి ఎందుకు ఇలా చేస్తున్నారు. ఒకవేళ అతన్ని ఆడించకూడదనుకుంటే, జట్టులోకి తీసుకోవడం ఎందుకు?” అని కార్తిక్ అన్నాడు. 2020లో సిరాజ్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. అయితే గడిచిన ఆరేళ్లలో ఏ సిరీస్‌కైనా సిరాజ్ ఎంపికైతే కనీసం ఒక మ్యాచ్‌లోనైనా బరిలో దిగాడు. అయితే తన కెరీర్‌లో మొట్టమొదటిసారి సిరీస్ మొత్తం బెంచ్‌కే పరిమితం అయ్యాడు. కొంతకాలంగా భారత టెస్టు జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న సిరాజ్‌కు, వరుసగా రెండు మ్యాచ్‌లలో అవకాశం దక్కని సందర్భాలు చాలా అరుదు. ప్రస్తుత వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025- 2027)లో సిరాజ్ 11 మ్యాచ్‌ల్లో 43 వికెట్లు పడగొట్టాడు.

ఓవరాక్షన్ తగ్గించుకో..

హర్షిత్ రాణాపై నెటిజన్లు ఫైర్!

దోహా, నవంబర్ 27 (సమయం న్యూస్): ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నమెంట్‌లో భారత్ ‘ఎ’ జట్టు ప్రయాణం ముగిసింది. గురువారం దోహాలో జరిగిన సెమీ-ఫైనల్‌లో శ్రీలంక ‘ఎ’ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ సేన 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగుల భారీ స్కోర్ చేయగా... శ్రీలంక ‘ఎ’ కేవలం 41.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. లసిత్ క్రూస్‌పుల్లే (116), సినెత్ జయవర్ధనే (105) సూపర్ సెంచరీలతో శ్రీలంక ‘ఎ’ జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. మరోవైపు టీమిండియా పేసర్ హర్షిత్ రాణాకు సంబంధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా ఏడు ఓవర్ల బౌలింగ్‌లో ఏకంగా 61 పరుగులు ఇచ్చి.. కేవలం ఒకే ఒక్క వికెట్ తీశాడు. అయితే, తన బౌలింగ్‌లో లంక బ్యాటర్ బంతిని బౌండరీకి తరలించగా.. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బంతిని అందుకోవడంలో కాస్త ఆలస్యం చేశాడు. దీంతో తీవ్ర అసహనానికి లోనైన హర్షిత్.. షాబాజ్‌ను దూషించాడు. తొందరగా బంతి అందుకో అంటూ పరుష పదజాలం వాడాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో నెటిజన్లు హర్షిత్ రాణా ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ‘మరీ ఇంత ఆటిట్యూడ్ పనికి రాదని.. అంతర్జాతీయ స్థాయి ఆటగాడివి అయి ఉండి ఇంత ఓవరాక్షన్ అవసరమా?’ అంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. సాటి ఆటగాడిని తిట్టడం సరికాదని.. ఆటిట్యూడ్ తప్ప హర్షిత్ దగ్గర ఇంకేమీ లేదని విమర్శిస్తున్నారు. బీసీసీఐ ఈ విషయంలో జోక్యం చేసుకుని హర్షిత్‌ను మందలించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీ 2026లో హర్షిత్ రాణా నాలుగు మ్యాచ్‌లలో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా 26 ఓవర్ల బౌలింగ్‌లో ఏకంగా 217 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక 2024లో భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన 24 ఏళ్ల హర్షిత్.. ఇప్పటి వరకు రెండు టెస్టుల్లో 4, 14 వన్డేల్లో 26, 14 టీ20 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీశాడు.





ఏఐ ఉద్యోగాలను లాగేసుకోలేదు..

మీరే అప్పగించారు!

ఆర్జీవీ సంచలన పోస్టు..!

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల కోతపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ది ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఏఐ ఉద్యోగాలను దోచుకోవడం లేదని, ఉద్యోగులే తమ పనిని రహస్యంగా ఏఐకి అప్పగించారని వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కోడింగ్ కోసం క్లాడ్‌ను, మార్కెటింగ్ ఉద్యోగులు ఆలోచనల కోసం చాట్‌జీపీటీని, డిజైనర్లు మిడ్‌జర్నీని ఉపయోగిస్తూ ఆ పనిని తామే చేసినట్లు చూపిస్తున్నారని వర్మ పేర్కొన్నారు. సమాచార విశ్లేషణ నుంచి వినియోగదారులకు సమాధానాలు ఇవ్వడం వరకు అనేక పనులను ఉద్యోగులు ఏఐతో చేయిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉద్యోగుల పనితీరులో వచ్చిన మార్పులను గుర్తించేందుకు సంస్థలకు గూఢచారులు అవసరం లేదని, ఆర్థిక గణాంకాలే వాస్తవాలను వెల్లడిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఏఐతో ఉత్పాదకత పెరగడంతో పాటు పనులు వేగంగా పూర్తవుతున్నాయని వర్మ పేర్కొన్నారు. కృత్రిమ మేధకు విశ్రాంతి అవసరం లేదని, అనారోగ్య సమస్యలు, వేతనాల పెంపు డిమాండ్లు ఉండవని వ్యాఖ్యానించారు. ఇలాంటి పరిస్థితుల్లో సంస్థలు ఉద్యోగాల కోత ప్రకటించినప్పుడు సాంకేతికతను నిందించడం విడ్డూరమని అన్నారు. ఏఐ వినియోగాన్ని రహస్యంగా ఉంచడంలో భవిష్యత్తు లేదని, దానిని బహిరంగంగా, సమర్థంగా ఉపయోగించుకోవడంలోనే ఉందని ఉద్యోగులకు సూచించారు. భవిష్యత్తులో ఏఐని ఉపయోగించే వ్యక్తులే దానిని ఉపయోగించని వారి స్థానాలను భర్తీ చేస్తారని అభిప్రాయపడ్డారు. వర్మ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రుహానీకి పెళ్లి కళ..

అల్లు అరవింద్ ఆశీస్సులు ఫలించేనా?

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ పెళ్లి ఆశీస్సుల సెంటిమెంట్ మరోసారి తెరపైకి వచ్చింది. ఆయన ఆశీర్వదించిన కథానాయికలకు తెలుగు అబ్బాయిలతో వివాహాలు జరుగుతాయనే సరదా చర్చ సినీ వర్గాల్లో కొనసాగుతోంది. తాజాగా ఈ జాబితాలోకి కథానాయిక రుహానీ శర్మ చేరారు. 'ఆకాశంలో ఒక తార' చిత్ర విజయోత్సవ వేడుకలో అల్లు అరవింద్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం ఎవరినైనా ప్రేమిస్తున్నావా? అని రుహానీని అడిగానని, ఆమె లేదని సమాధానమిచ్చినట్లు అల్లు అరవింద్ తెలిపారు. త్వరలోనే పెళ్లి జరుగుతుందని, అది కూడా హైదరాబాద్ అబ్బాయితోనే జరుగుతుందని ఆశీర్వదించినట్లు సరదాగా వెల్లడించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతంలో లావణ్య త్రిపాఠిని అల్లు అరవింద్ ఇదే తరహాలో ఆశీర్వదించగా, ఆమె వరుణ్ తేజ్‌ను వివాహం చేసుకుని మెగా కుటుంబంలోకి కోడలిగా అడుగుపెట్టారు. 'భీష్మ' చిత్ర వేడుకలో రష్మిక మందన్నను కూడా ఆయన ఆశీర్వదించారు. ఇటీవల మృణాల్ ఠాకూర్‌కు సైతం పెళ్లి ఆశీస్సులు అందించడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పుడు రుహానీ శర్మ విషయంలోనూ అల్లు అరవింద్ సెంటిమెంట్ ఫలిస్తుందా? అంటూ అభిమానులు సరదాగా చర్చించుకుంటున్నారు.



మీకు యాక్టింగ్ వస్తే.. 'ఆర్సీ17'లో ఛాన్స్

చిత్ర బృందం బంపర్ ఆఫర్

హైదరాబాద్, నవంబర్ 27 (సమయం న్యూస్): మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, మాస్టర్ స్టోరీటెల్లర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'ఆర్సీ17'. ఇండస్ట్రీ హిట్ 'రంగస్థలం' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా (చ=జ2మాబఒఒబ) కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు ఇటీవలే ఘనంగా జరిగాయి. తాజాగా నటనపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు చిత్ర బృందం ఒక అద్భుతమైన బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ సినిమా కోసం వివిధ వయసుల నటీనటుల కోసం అన్వేషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా క్యాస్టింగ్ కాల్ పోస్టర్‌ను విడుదల చేసింది. "కొత్త ప్రపంచం.. కొత్త కథ.. బహుశా మీ కోసమే ఓ పాత్ర ఎదురుచూస్తుందేమో" అంటూ మేకర్స్ ఈ ఆడిషన్స్‌కు ఆహ్వానం పలికారు. 16 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న స్త్రీ, పురుషులు ఈ సినిమాలో నటించడానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలుపుతూ ఓ ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. యాక్టింగ్ టాలెంట్ ఉండి, రామ్ చరణ్ - సుకుమార్ సినిమాలో నటించాలని ఆశపడే వారు తమ పోర్ట్‌ఫోలియో, ఆడిషన్ వివరాలను ఈమెయిల్ ఐడీ: src17casting@gmail.com, వాట్సాప్ నంబర్: 9110564651కు పంపవచ్చు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే వివరాలు పంపాలని సూచించారు. వాట్సాప్ నంబర్‌కు కేవలం టెక్స్ట్ మెసేజ్‌లు మాత్రమే పంపాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ కాల్స్ చేయకూడదని, అలాగే ఆడిషన్స్ కోసం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పంపకూడదని చిత్ర బృందం స్పష్టమైన నిబంధనలు విధించింది.



ఇటీవలే పూజా కార్యక్రమాలతో మొదలైన 'ఆర్సీ17' క్యాస్టింగ్ ప్రక్రియను డిసెంబర్ నాటికి పూర్తి చేసి, వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సుకుమార్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇంతటి భారీ పాన్-ఇండియా చిత్రంలో నటించే సువర్ణావకాశం రావడంతో.. ఆసక్తిగల నటీనటుల నుంచి భారీ స్పందన లభిస్తోన్నట్లుగా తెలుస్తోంది. మరెందుకు ఆలస్యం.. మీకు నటన తెలిసి ఉంటే.. మీరూ అప్లయ్ చేసుకోండి.

డైరెక్టర్ నన్ను చంపేస్తారు!

యువ సామ్రాట్ నాగచైతన్య, మీనాక్షి చౌదరి జంటగా నటిస్తున్న మైథికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'వృషకర్మ' విడుదలకు ముందే భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం కథపై ఇప్పటికే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాకు పార్ట్-2 ఉండేలా ఓపెన్ ఎండింగ్ ఉంటుందా అనే ప్రశ్నపై తాజాగా హీరోయిన్ మీనాక్షి చౌదరి తనదైన శైలిలో చమత్కారంగా స్పందించారు. కథలోని కీలక మలుపులను ఇప్పుడే బయటపెట్టలేనని చెబుతూ.. "ఈ విషయంపై నేను ఎక్కువగా మాట్లాడితే డైరెక్టర్ నన్ను చంపేస్తారు" అంటూ ఆమె నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఆ సస్పెన్స్ అంతా డిసెంబర్ 4న థియేటర్లలోనే వీడుతుందని ఆమె ఆసక్తికర హింట్ ఇచ్చారు. మరోవైపు, ఈ చిత్రంలో తన పాత్రకు తాను సొంతంగా డబ్బింగ్ చెప్పుకోలేదని మీనాక్షి వెల్లడించారు. గతంలో 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు తన గొంతునే వినిపించినప్పటికీ, 'వృషకర్మ' కోసం మాత్రం డబ్బింగ్ ఆర్టిస్ట్ వాయిస్‌ను వాడినట్లు తెలిపారు. భవిష్యత్తులో రాబోయే ప్రాజెక్టులలోనైనా సొంతంగా డబ్బింగ్ చెప్పుకునే అవకాశం వస్తుందని ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కథ, స్క్రీన్‌ప్లే అందించిన ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఇందులో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడిగా నటించగా, జయరామ్, సత్య, బ్రహ్మాజీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, రాగుల్ ధరుమన్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, శ్రీ నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైన్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి.



మనసును హత్తుకునే 'నాన్న కుట్టి'



వైవిధ్యమైన కథలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోనీ ఈసారి తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కిన 'నాన్న కుట్టి' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. తమిళంలో గతవారమే విడుదలైన ఈ చిత్రం తాజాగా తెలుగులో విడుదలైంది. ఉత్కంఠభరిత కథలతో అలరించే విజయ్ ఆంటోనీ ఈసారి భావోద్వేగాలతో ప్రేక్షకులను ఎంతవరకు మెప్పించారో చూద్దాం. విశాఖపట్నానికి చెందిన సూర్య (విజయ్ ఆంటోనీ) తన పసిపాప దియా (బేబీ లితన్య)తో కలిసి ఊటీకి వెళ్లి స్థిరపడతాడు. తల్లి రేవతి చనిపోయిందని చెప్పి దియాను అల్లారుముద్దుగా పెంచుతుంటాడు. దియా చదువుతున్న పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే అనిత (ప్రీతి అస్రానీ) సూర్య మంచితనాన్ని చూసి ప్రేమిస్తుంది. అయితే ఆమె ప్రేమను సూర్య సున్నితంగా తిరస్కరిస్తాడు. చనిపోయిందని చెప్పిన రేవతి ఓ రోజు అనితకు కనిపించడంతో కథ మలుపు తిరుగుతుంది. అదే సమయంలో దియా అరుదైన వ్యాధి బారిన పడుతుంది. ఆమె ప్రాణాలను కాపాడేందుకు కన్న తల్లిదండ్రులకు జన్మించిన మరో బిడ్డ మూలకణాలు అవసరమని వైద్యులు చెబుతారు. ఈ క్రమంలో దియా తన కన్నకూతురు కాదనే నిజాన్ని సూర్య బయటపెడతాడు. ఇంతకీ దియా ఎవరి బిడ్డ? ఆమెను సూర్య ఎందుకు పెంచుతున్నాడు? పాప ప్రాణాలను కాపాడేందుకు ఎలాంటి పోరాటం చేశాడన్నదే మిగతా కథ. దర్శకుడు ము. మారన్ ఎంచుకున్న కథాంశం హృదయాన్ని హత్తుకుంటుంది. తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, ఊటీ అందాలతో ప్రథమార్ధం ఆహ్లాదకరంగా సాగుతుంది. విరామానికి ముందు వచ్చే మలుపు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతుంది. అయితే ద్వితీయార్ధంలో కథనం నెమ్మదించడం, వైద్యపరమైన అంశాలకు సంబంధించిన సన్నివేశాల్లో సాగదీత ప్రేక్షకుల సహనాన్ని పరీక్షిస్తాయి. పతాక సన్నివేశాల్లోని భావోద్వేగాలు మాత్రం కంటతడి పెట్టిస్తాయి. వాణిజ్య హంగుల జోలికి వెళ్లకుండా కథను నిజాయతీగా చెప్పేందుకు దర్శకుడు ప్రయత్నించారు. సూర్య పాత్రలో విజయ్ ఆంటోనీ సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాల్లో తన నటనతో మెప్పించారు. బేబీ లితన్య అమాయకమైన నటన చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రీతి అస్రానీ తన పాత్ర పరిధి మేరకు చక్కగా నటించారు. మిగిలిన నటీనటులు తమ పాత్రలకు న్యాయం చేశారు. విజయ్ ఆంటోనీ నేపథ్య సంగీతం భావోద్వేగాలకు మరింత బలాన్నిచ్చింది. రాజీవ్ రాజేంద్రన్ ఛాయాగ్రహణం ఆకట్టుకుంది. ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాలను కుదించి ఉంటే చిత్రం మరింత మెరుగ్గా ఉండేది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి. మొత్తంగా 'నాన్న కుట్టి' రక్తసంబంధానికి మించిన ప్రేమను ఆవిష్కరించే భావోద్వేగభరిత చిత్రం. నెమ్మదించిన కథనం, సాగదీత సన్నివేశాలు మినహాయిస్తే విజయ్ ఆంటోనీ, బేబీ లితన్య నటన, హృదయాన్ని కదిలించే పతాక సన్నివేశాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. కుటుంబ అనుబంధాలు, భావోద్వేగభరిత కథలను ఇష్టపడేవారికి ఈ చిత్రం నచ్చుతుంది.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

ఈసీఐఎల్‌లో విద్యార్థుల భారీ ఆందోళన





- **పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి రూ.8 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో మార్పులపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి**

మల్కాజిగిరి, నవంబర్ 27: సమయం

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు శుక్రవారం ఈసీఐఎల్‌లో భారీ నిరసన చేపట్టారు. దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లగర్ల మోదిరామదేవ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు రాష్ట్ర బీసీ యువజన సంఘం కన్వీనర్ వంశీ, శివకృష్ణ ముదిరాజ్ సమన్వయం వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు, హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, ప్రస్తుత పథకంలో ఎలాంటి మార్పులు చేపట్టే ముందు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీసీ, ఎస్సీ మంత్రులు, శాసనసభ్యులు, మేధావులు, విద్యార్థి సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విస్తృత చర్చల అనంతరమే నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సర్టిఫికెట్లు లేక ఉపాధి అవకాశాలకు దూరంఫీజు బకాయిల కారణంగా దాదాపు నాలుగు లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే నిలిచిపోయాయని నాయకులు పేర్కొన్నారు. చదువులు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు అందక ఉద్యోగాల్లో చేరలేకపోతున్నారని, ఉన్నత చదువులు కొనసాగించలేకపోతున్నారని తెలిపారు. కొందరు ఉద్యోగ అవకాశాలను కోల్పోతుండగా, మరికొందరు విదేశాల్లో ఉద్యోగాలు పొందే అవకాశాలకూ దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాలల్లో తగ్గుతున్న ప్రవేశాలుఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సంక్షోభం కారణంగా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌లో దాదాపు 30 వేల మంది విద్యార్థులు పాల్గొనలేదని, ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 50 శాతం పీజీ సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో 70 నుంచి 80 శాతం వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో దాదాపు 70 వేల డిగ్రీ సీట్లు, ప్రైవేట్ కళాశాలల్లో సుమారు రెండు లక్షల సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయని పేర్కొన్నారు. ఈ సమస్య కారణంగా దాదాపు 600 కళాశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుత పథకాన్నే కొనసాగించాలిఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ పథకం పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నాయి. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు సర్టిఫికెట్లు, హాల్‌టికెట్లు నిలిపివేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరాయి. బకాయిల చెల్లింపునకు కాలపరిమితితో కూడిన కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్‌లు, అధికారిక సమాచార వ్యవస్థల ద్వారా వివరాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశాయి.విద్యార్థులకు బీసీ నేతల మద్దతువిద్యార్థుల ఆందోళనకు పలువురు బీసీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర బీసీ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అనంతయ్య, బీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రసనలో పాల్గొని మద్దతు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య కూడా విద్యార్థుల డిమాండ్లకు మద్దతు ప్రకటించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన విద్యా, సామాజిక న్యాయ సమస్యగా ప్రభుత్వం పరిగణించాలని నిర్వాహకులు స్పష్టం చేశారు.

బాలికను వెంటాడి వేధించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

- **చైతన్యపురి పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తు.. బాధితురాలికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం**

మల్కాజిగిరి సమయం

బాలికను వెంటాడుతూ వేధింపులకు పాల్పడిన వ్యక్తికి న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడికి రూ.2 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన క్రైమ్ నంబర్ 1092/2023 కేసులో షేక్ యూనస్ (28)ను న్యాయస్థానం దోషిగా నిర్ధారించింది.వెంటాడుతూ వేధింపులు.. పోలీసులకు ఫిర్యాదు2023 డిసెంబర్ 14న బాధిత బాలిక శివానీ డిగ్రీ కళాశాల నుంచి ఓమ్ని ఆసుపత్రి బస్‌స్టాప్ వైపు వెళ్తుండగా, కొత్తపేట రైతుబజార్ సమీపంలో నిందితుడు ఆమెను వెంబడించి ఫోన్ నంబర్, ఇతర వివరాలు అడుగుతూ వేధించాడు. దీంతో బాలిక వెంటనే తన తండ్రికి ఫోన్ చేసి విషయం తెలిపింది. అంతకుముందు కూడా సుమారు 45 రోజుల క్రితం నిందితుడు మద్యం మత్తులో బాలిక ఇంటికి వెళ్లి ఆమెను పిలిచినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అప్పటి నుంచి తనను అనుసరిస్తూ వేధిస్తున్నాడని బాలిక పోలీసులను ఆశ్రయించింది.పక్కా ఆధారాలతో చార్జిషీట్దర్యాప్తు మేరకు కేసు నమోదు చేసిన చైతన్యపురి పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు.



జనన ధ్రువీకరణ పత్రం ఆధారంగా బాధితురాలు మైనర్ అని నిర్ధారించారు. మేజిస్ట్రేట్ ఎదుట సీఆర్పీసీ సెక్షన్ 164 కింద ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. 2023 డిసెంబర్ 15న నిందితుడిని అరెస్టు చేసి, దర్యాప్తు అనంతరం న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.నిందితుడికి జైలు శిక్ష.. బాధితురాలికి పరిహారం ఎల్‌బీనగర్‌లోని అత్యాచారం, పోక్సో కేసుల ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ న్యాయస్థానంలో విచారణ పూర్తయిన అనంతరం న్యాయమూర్తి పద్మావతి నిందితుడు షేక్ యూనస్‌ను దోషిగా నిర్ధారించారు. ఐపీసీ సెక్షన్ 354డీ, పోక్సో చట్టంలోని 11, 12 సెక్షన్ల కింద రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.50 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి సబ్‌ఇన్స్పెక్టర్ ఎం.ఆర్.ఎస్.వి. ప్రసాద్‌తో పాటు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పి. సత్యనారాయణ, కృష్ణప్రసన్న కీలకంగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- **ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS**
- **ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి**

నారాయణపేట,నవంబర్,27(సమయం న్యూస్)

జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రతపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం చలికాలం కావడంతో ఉదయం, రాత్రి వేళల్లో మంచు తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. మంచు కారణంగా రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాలు, రోడ్డు మలుపులు, రహదారి అంచులు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల వాహనదారులు వేగాన్ని నియంత్రిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రయాణించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా, సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్పీ స్పష్టం చేశారు. అతివేగం,నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.



ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో ప్రయాణించేటప్పుడు వాహనాలకు సంబంధించిన లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని, వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పొగమంచు ఎక్కువగా ఉన్నప్పుడు ఫాగ్ లైట్లు ఉపయోగించాలని, ముందున్న వాహనానికి తగిన దూరం పాటించాలని, అవసరమైతే సురక్షితమైన ప్రదేశంలో వాహనాన్ని నిలిపి పరిస్థితులు అనుకూలించిన తర్వాత ప్రయాణం కొనసాగించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు.రోడ్డు ప్రమాదాలు కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతున్నాయని, కొద్దిపాటి నిర్లక్ష్యం విలువైన ప్రాణాలను బలితీసుకుంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడిపినప్పుడే ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు.ప్రజల ప్రాణాల రక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు.

వైద్య విద్యార్థులు సేవాభావంతో ఎదగాలి

నిర్మల్, నవంబర్ 27:

వైద్య విద్యార్థులు సేవాభావం, సమయపాలన, నిబద్ధతతో విద్యను అభ్యసించి దేశం గర్వించే వైద్యులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.ప్రభుత్వ వైద్య కళాశాలలో 2026 బ్యాచ్ మొదటి సంవత్సరం విద్యార్థుల వైట్ కోట్ సెర్మనీలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు కోట్లు, స్టెతస్కోపులు అందజేశారు. మొబైల్‌కు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సి.వి. శారద, ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



భూ భారతి రీసర్వే వేగవంతం చేయాలి

సిద్దిపేట, నవంబర్ 27:

గజ్వేల్ మండలం కోమటిబండ, వర్గల్ మండలం సింగాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ భారతి రీసర్వేను కలెక్టర్ కె. హైమావతి పరిశీలించారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. ముందుగా ప్రభుత్వ, అటవీ, ఇరిగేషన్, రైల్వే భూములను సర్వే చేసి, అనంతరం పట్టా భూముల సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు రెండు రోజుల ముందే సమాచారం అందించి, రోవర్ యంత్రాలతో ఖచ్చితత్వం, పారదర్శకతతో సర్వే నిర్వహించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రభావంతో నీటి కొరత దృష్ట్యా రబీలో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.



విదేశీ ఉద్యోగాలకు టామ్‌కామ్ ఉచిత శిక్షణ

నిజామాబాద్, నవంబర్ 27:

విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు టామ్‌కామ్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి సూచించారు. నిజామాబాద్ ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్, యూకే, ఐర్లాండ్ తదితర దేశాల్లో నర్సింగ్, కార్పెంటర్, ఫిజియోథెరపీ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఉచిత భాషా శిక్షణతో పాటు అర్హత సాధించిన వారికి వీసా, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ విదేశీ ఉద్యోగాల్లో రాణించేందుకు భాషా ప్రావీణ్యం కీలకమని పేర్కొన్నారు. టామ్‌కామ్ కార్యక్రమాలపై సమాచారం అందించేందుకు పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.



ప్రజలకు మెరుగైన సేవలే మీసేవ కేంద్రాల లక్ష్యం

ఆదిలాబాద్, నవంబర్ 27:

ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు జిల్లాలో కొత్త మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. శుక్రవారం మసూద్ చౌక్‌లో సైఫ్ అహ్మద్ మసూద్‌కు మంజూరైన నూతన మీసేవ కేంద్రాన్ని ప్రారంభించారు.మీసేవ ద్వారా వివిధ ధ్రువపత్రాలు, భూభారతి, జననమరణ ధ్రువీకరణ, పట్టణ ప్రణాళిక తదితర సేవలను సకాలంలో అందించాలని సూచించారు. కేంద్రాల పనితీరులో అవకతవకలు ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- **పోలీస్ శాఖతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత- కోస్గి సీఐ సైదులు**

మద్దూరు మున్సిపల్(మం)నవంబర్,27(-సమయం న్యూస్)

మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కోస్గి సీఐ సైదులు తెలిపారు.ఈ క్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూరు ఎస్సై విజయ్ కుమార్, నిడ్చింత గ్రామ సర్పంచ్ భర్త శ్రీనివాసులు కలిసి మద్దూరు నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రహదారిపై నిడ్చింత గ్రామ రోడ్డు మలుపు వద్ద ప్రమాదకర ప్రాంతాన్ని (బ్లాక్ స్పాట్) గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా త్వరలోనే ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు అందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణ పోలీస్ శాఖతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో వేగ నియంత్రణ పాటించాలని, ముఖ్యంగా రోడ్డు మలుపులు, ప్రమాదకర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన కారణాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని సీఐ తెలిపారు.



అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉట్కూర్ మండలం, నవంబర్,27(సమయం న్యూస్)

ఉట్కూర్ మండల కేంద్రం లోని గ్రామ పంచాతి లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక సందర్శించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవితాన్ని భీమా పథకాన్ని సద్వినియం చేసుకోవాలని గ్రామ ప్రజలకు కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందన్నారు.కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినా, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పావని, అధికారులు పాల్గొన్నారు..



ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల, నవంబర్ 27:

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించి, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. లక్షెట్టిపేట మండలం అంకతిపల్లి, ఇటిక్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ధాన్యం నాణ్యత, తూకం, రికార్డులు, గన్నీ బ్యాగుల లభ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. గ్రేడ్ఏ ధాన్యానికి రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధరతో పాటు సన్న రకానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు.అనంతరం పలు రైస్ మిల్లులు, దండేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, కర్ణపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ధాన్యం నిల్వలు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, అవసర మైన సౌకర్యాలు అందించాలని అధికారులను ఆదేశించారు.



అక్రమ అండాల సేకరణ కేసులో డాక్టర్ పద్మజకు హైకోర్టులో చుక్కెదురు

- **ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసిన న్యాయస్థానం.**

భువనగిరి నవంబర్ 27 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి అక్రమంగా అండాలను సేకరించినట్లు నమోదైన కేసులో పద్మజ ఫెర్టిలిటీ సెంటర్ యజమానులు డాక్టర్ పి. పద్మజ, డాక్టర్ దుర్గారావులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ డాక్టర్ పద్మజ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు విచారించి కొట్టివేసింది. భువనగిరి పట్టణంతో పాటు హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట ప్రాంతంలో పద్మజ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని డాక్టర్ పద్మజ తన పిటిషన్‌లో వాదించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన ఓ నిందితుడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా, దర్యాప్తు తదుపరి దశలో తన పేరును నిందితురాలిగా చేర్చారని కోర్టుకు వివరించారు. అంతేకాకుండా, కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు తాను వైద్య వృత్తికి దూరంగా ఉంటానని, పోలీసుల విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే, ఆమె వాదనలను పరిశీలించిన హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయం వెలువరించింది.ఈ పరిణామంతో అక్రమ అండాల సేకరణ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తులో తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది.



కారుణ్య నియామకాల కింద ముగ్గురికి ఉద్యోగాలు

భూపాలపల్లి, నవంబర్ 27:

ప్రభుత్వ విధుల నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన ఉద్యోగులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కారుణ్య నియామకాల కింద ఎంపికైన ముగ్గురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగ నియామక ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కారుణ్య నియామకాల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.నియామకాలు పొందిన ప్రవల్లికకు భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో, కమల్‌కు భూపాలపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో, సోఫియాకు భూపాలపల్లి ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో పోస్టింగ్‌లు కేటాయించినట్లు తెలిపారు. నూతన ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పువ్వాడ ఉదయ్ నగర్ సర్వే పూర్తి

- **వారం రోజులలో ఉన్నతాధికారులకు నివేదిక**
- **అవినీతి అక్రమాలు కబ్జాలు డబుల్ పట్టాలు...**
- **మా హయాంలో మాత్రం కాదు**
- **పలు ప్రశ్నలు - సమాధానాలు కరవు**
- **అనకొండ స్థాయి కుంభకోణం ఇది**
- **కోట్లలో కొనసాగిన భూధందా**
- **యం డి. షఫీ యు జమ.**



ఖమ్మం, నవంబర్ 27 : (సమయం న్యూస్)

జిల్లా కేంద్రం ఖమ్మం, ఖమ్మం సమీప ప్రాంతంలో రఘునాధపాలెం మండలం , ఈ మండలంలో ఒక గ్రామ పంచాయతీ పువ్వాడ ఉదయ నగర్. ఇటీవల కాలంలో ఉదయ్ నగర ్గ్రామపంచాయతీలో గత మాసం అక్టోబర్ 14వ తేదీన సర్వే నిర్వహించారు. సుమారు వారం రోజుల వరకు ఈ సర్వే కొనసాగింది. సర్వే నిర్వహించి , ఒక నెల రోజులు దాటినా ఇంకా ఆ సర్వే ఫలితాలను క్రోడీకరించే పని లో ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఈ సర్వే నివేదికను మూడు భాగాలుగా విభజించి , తమ పై ఉన్నతాధికారులకు వారం రోజులలో సర్వే నివేదికను పంపు తామని , ఈ సర్వేలో పాల్గొనని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేసి , తదనంతరం నివేదికను సమర్పిస్తారని అధికారులు ప్రకటిస్తున్నారు. కాగా ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అసలు విషయంలో మాత్రం వారి నుండి సమాధానాలు కరవుతున్నాయి. పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామ పంచాయతీ లో అనేక అవినీతి, అక్రమాలు, కబ్జాలు, డబల్ పట్టాలు అంశాలపై ఉదయించే ప్రశ్నలకు అధికారులనుండి ..... " అప్పుడు తాము లేము, తమ హయాంలో జరగలేదు, తెలియదు, తెలుసుకుంటాం " అనే ముచ్చట్లు తప్ప స్పష్టంగా సమాధానాలు రావడం లేదు. ఈ గ్రామ పంచాయతీ ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన ప్లాట్ల దందా లో కొన్ని కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపణలు. జిల్లా కలెక్టర్, సీపీ లతో పాటుగా వివిధ హక్కుల సంఘాలకు, లోకాయుక్త కు.... అనేక మంది లబ్ధి దారులు చేసిన ఫిర్యాదులు, ఈ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. "మచ్చుకు డి బ్లాక ్ఉదంతం చాలు " పువ్వాడ ఉదయ్ నగర ్గ్రామపంచాయతీలో జరిగిన భూ దందా కు కేవలం, మచ్చుకు ఈ డి బ్లాక ్ఉదంతం చాలు. పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామం వెలసిన కొత్తలో అధికారులు అర్హులని భావించిన లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ గ్రామంలో మొత్తం ఏ నుంచి హెచ్ వరకు బ్లాకులు ఏర్పాటు చేశారు. ఆనాడు ఇళ్ల పట్టాలు మంజూరి అనంతరం కాల పరిమితి దాటిపోయిన కూడా డి బ్లాక్ ఇల్లస్థలాల లబ్ధిదారులు రాకపోవడంతో ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంది. ఈ ప్రక్రియను రఘునాధపాలెం తహసిల్దారుగా విధులు నిర్వహించిన జి. నరసింహారావు చేపట్టారు. "సర్వే నెంబరు 192 , ఇంటి పట్టాలు కొరకు కేటాయించిన పట్టాలు నిబంధన ఉల్లంఘన ప్రభుత్వం స్వాధీనం. " అనే విషయ సూచిక కింద ఆర్సీ నెంబర్ ఎ / 175 / 20 20 , తేదీ 09/06/2022 న ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే సమయంలో గిర్దావర ్ 1 పంచనామా నిర్వహించి, ప్లాట్ల ను స్వాధీనం చేసుకోవడం జరిగింది. కాగా, సదరు స్వాధీనం చేసుకోబడిన ప్లాట్లకు ఎటువంటి గృహ నిర్మాణం, విద్యుత్ మొదలగు అనుమతులు ఇవ్వరాదని కోరడం మైనది అని ఆనాడు తాసిల్దార్ జి. నరసింహారావు ఉత్తర్వులతోపాటు స్వాధీనం చేసుకోబడిన ప్లాట్ల వివరాలను కూడా ప్రకటించారు. తాసిల్దార్ లూథర్ విల్సన్ హయాంలో స్వాధీనం చేసుకోబడిన డి బ్లాక్ ప్లాట్ ల చుట్టూరా ఫెన్సింగ్ వేశారు. ఈ విషయం ప్రస్తుత తాసిల్దార్, ప్రస్తుత పువ్వాడ ఉదయ నగర్ కార్యదర్శి కు తెలియదంట. తెలుసుకుంటారంట. ఇది తమ హయాంలో జరగలేదు కదా అని జవాబు. పరిపాలన పరంగా చోటు చేసుకున్న ఇలాంటి పరిణామాల గురించి, ఆనాడు అధికారులుగా వ్యవహరించిన వారు తమ తగ నంతరం వచ్చే అధికారులకు ఈ రిపోర్టు అంద జేయడం ఆనవాయితీ. ఇదిలావుండగా పువ్వాడ ఉదయ్ నగర్ గ్రామ పంచాయతి కీ ప్రస్తుతం కార్యదర్శి గా వ్యాహరిస్తున్న అధికారి మహేష్ కన్నా ముందు రాంబాబు, ప్రసాద్, ఒక మహిళా, నాగేశ్వరావు లు కార్యదర్శి లు గా విధులు నిర్వహించారు. ఇందులో రాంబాబు అనే కార్యదర్శి రెండు దఫాలుగా పోవడం ఉదయ నగర్ కార్యదర్శిగా పనిచేశారు. కాగా రాంబాబు, ప్రసాద్ కు డి బ్లాక్ గురించి తెలియదు. అవగాహన కూడా లేదు అట. ప్రస్తుత కార్యదర్శి మహేష్ కు ఈ డి బ్లాక్ వివరాలు అడిగినప్పుడు... ప్రస్తుతం అక్కడ నిర్మాణమైన కొన్ని ఇళ్ల గురించి ప్రశ్నిస్తే, డి బ్లాక్ లో.... ప్రస్తుతం నిర్మాణమైన ఇల్లు లు గతంలోనే అనగా అధికారులు ఈ ప్లాట్లను స్వాధీనం చేసుకోక ముందు నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. వాస్తవాన్ని పరిశీలిస్తే అధికారులు ఈ ప్లాట్లను స్వాధీనం చేసుకునే సమయంలో కేవలం ఒక్క ఇల్లు మాత్రమే సగం నిర్మాణమై ఉంది. ఇప్పుడు నిర్మాణమైన ఇల్లు లు ఆనాడు లేవు. ఈ విషయాన్ని పాత గ్రామ కార్యదర్శి వెల్లడించారు. దీనిపై నివేదికను తన తర్వాత వచ్చిన కార్యదర్శికి ఆయన సమర్పించారు. ఈయన తర్వాత వచ్చిన కార్యదర్శులు ఈ విషయంలో తమకు ఏమీ తెలియదని ఇది తమ సహాయం పేర్కొనడం విశేషం. నాగేశ్వరరావు తన తర్వాత వచ్చిన ప్రసాద్ కు ఈ నివేదిక ఇవ్వగా తనకేమీ తెలియదని తాను కేవలం ఐదు నెలల వరకు మాత్రమే విధులు నిర్వహించా నానని ఆనాడు కార్యదర్శిగా వ్యవహరించిన ప్రసాదు వివరించడం మరో విశేషం. రెండు దఫాలుగా ఇక్కడ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రాంబాబు సైతం తనకు ఏమీ తెలియదని పేర్కొనడం విశేషంలోకెల్లా విశేషం. పువ్వాడ ఉదయ నగర్ కార్యదర్శిగా నాగేశ్వరరావు గా 2020 నవంబర్ నుండి 2023 జనవరి వరకు విదులు నిర్వహించారు. ఈయన కన్నా ముందు 2019 నుండి 2020 జూన్ వరకు రెండో దఫా 2025 జనవరి నుండి జూలై 2025 వరకు రాంబాబు విధులు నిర్వహించారు. నాగేశ్వరరావు తర్వాత కేవలం ఐదు నెలల వరకు ప్రసాదు కార్యదర్శిగా విధులు చేపట్టారు. నాగేశ్వరరావు తో పాటు ప్రసాదు, రాంబాబు, మహేష్ అనే కార్యదర్శులకు ఈ డి బ్లాక్ గురించి తెలుసు అని ఇక్కడ స్పష్టం అవుతుంది. తాసిల్దారు నరసింహారావు హయాంలో డీ బ్లాక్ లోని పట్ల స్వాధీనం. మరో తాసిల్దార్ విల్సన ్హయంలో డి బ్లాక్ చుట్టూరా ఫెన్సింగ్ వేయడం ప్రస్తుత తాసిల్దార్ కి పువ్వాడ ఉదయ్ నగర్ లో పనిచేసిన కార్యదర్శులకు తెలియదనడం హాస్యాస్పదం. ల్గొయ్యడిన డి బ్లాక్ లో ని ప్లాట్లను తిరిగి g ఫ్ల్ల్ బ్ధిదారులకు అందజేయడం లేదా ప్రజాప్రయోజనాల కోసం వాడుకోవటం అనేది జిల్లా కలెక్టర్ నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ డి బ్లాక్ లో ని ర్మాణమైన కొన్ని ఇండ్లను కలెక్టర్ అనుమతించారా ? కలెక్టర్ అనుమతితోనే అక్కడ నిర్మాణాలు కొనసాగాయా? స్పష్టం చేయాల్సిన అధికారులు స్పష్టం చేయకుండా తమకు తెలియదని పేర్కొనడం అనేక అనుమానాలకు తావు నీస్తోంది.

ఈ అంశంపై ఆనాటి తాసిల్దార్ విల్సన్, ఆర్ ఐ సత్యనారాయణ , కార్యదర్శులు నాగేశ్వరరావు రాంబాబు ప్రసాద్, ప్రస్తుత తాసిల్దార్ శ్వేత , ప్రస్తుత కార్యదర్శి మహేష్ ల నుండి వివరణ ల అనంతరం ఇది రాయడం జరిగింది.

మంత్రులు కలెక్టర్ దీనిపై దృష్టి సారించాలి

ఈ అంశంపై జిల్లాలో ని ముగ్గురు మంత్రులు, జిల్లా కలెక్టర ్దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు

నేల లను రక్షించుకోవడం రైతుల బాధ్యత

- **జిల్లా వ్యవసాయ అధికారి -సక్రియ నాయక్**





మద్దూరు మండలం, నవంబర్,27(సమయం న్యూస్)

మద్దూరు మండలంలోని ఖాజీపూర్ గ్రామంలో "ఖేత్ బచావో అభియన్" (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం) లో భాగంగా శుక్రవారం ఖాజీపూర్ గ్రామ పంచాయతీ దగ్గర సాగు భూముల సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ ,పంటల మార్పిడి పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ మాట్లాడుతూ ,రాబోయే యాసంగి సీజన్లో ఏల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం నీటి లభ్యత తో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి వనరుల లభ్యతను అంచనా వేసుకుని విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. యాసంగిలో అధిక నీటిని వినియోగించే వరి పంట సాగును సాధ్యమైనంత వరకు తగ్గించి నీటి అవసరం తక్కువగా ఉండే సెనగ, పెసర, మినప మరియు కూరగాయలు వంటి పంటలు సాగు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నేల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సేంద్రీయ పదార్థాలను వినియోగాన్ని పెంచాలని , పంట అవశేషాలను నేలలో కలియదున్నలని ఈ నేల పరీక్షల ఆధారంగా సమతుల్యత ఎరువులను వినియోగించాలని అలాగే ఫార్మార్ రిజిస్ట్రేషన్ చేసుకొని రైతులు కచ్చితంగా చేసుకోవాలని. రైతులకు సూచించారు అనంతరం డాట్ సెంటర్ శాస్త్రవేత్త సత్యనారాయణ మాట్లాడుతూ యాసంగిలో పప్పు దినుసుల జాతికి చెందిన కంది,పెసర పంటలు వేసుకోవడం వల్ల నేలకు కలిగే లాభాలు తర్వాత పంటకి కావలిసిన సస్యరక్షణ చర్యలు రైతుల కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధిరి సకలేష్, గ్రామ సర్పంచ్ సాయప్ప,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, తారాసింగ్ ,గ్రామ ప్రజాప్రతినిధులు మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత 18 మండలాల్లో రుణాల రీషెడ్యూల్

- **బ్యాంకర్లకు జాయింట్ కలెక్టర్ బి. రాజా గౌడ్ ఆదేశం**

నిజామాబాద్, నవంబర్ 27:

జిల్లా కలెక్టరేట్‌లో డీసీసీ, డీఎల్ఆర్సీ సమీక్షా సమావేశం జాయింట్ కలెక్టర్ బి. రాజా గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలో 296 బ్యాంకు శాఖలు, 2,495 బీసీ పాయింట్ల ద్వారా సేవలు అందుతున్నాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ నాటికి రూ.13,924.54 కోట్ల డిపాజిట్లు, రూ.26,426.40 కోట్ల రుణాలతో సీడీ రేషియో 189.78 శాతంగా నమోదైంది.ఖరీఫ్‌లో రూ.3,158 కోట్ల పంట రుణ లక్ష్యానికి గాను రూ.2,487.14 కోట్లు 1,31,506 మంది రైతులకు పంపిణీ చేశారు. రబీ రుణ లక్ష్యాన్ని 100 శాతం పూర్తి చేయాలని, కరువు ప్రభావిత 18 మండలాల్లో అర్హులైన రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. నిష్క్రియంగా ఉన్న 42 బీసీ పాయింట్లను పునరుద్ధరించాలని, PMFMEలో పెండింగ్‌లో ఉన్న 109 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, మత్స్య KCC కింద పెండింగ్‌లో ఉన్న 79 దరఖాస్తులను 15 రోజుల్లోగా క్లియర్ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో RBI, NABARD, LDM, వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.



బాల్య వివాహ రహిత తెలంగాణకు సమన్వయంతో కార్యాచరణ

హైదరాబాద్, నవంబర్ 27, 2026:

2030 నాటికి బాల్య వివాహ రహిత తెలంగాణ సాధించేందుకు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో కార్యాచరణను బలోపేతం చేయాలని రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశంలో నిర్ణయించారు.మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (JRC), ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ (ICP) సహకారంతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాల నివారణ, బాలల లైంగిక దోపిడీ నుంచి రక్షణ, ప్రమాదంలో ఉన్న పిల్లలను గుర్తించడం, విద్య కొనసాగించడం, న్యాయ సహాయం, పునరావాసంపై చర్చించారు. బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు కనీస వివాహ వయస్సుగా సమావేశంలో పేర్కొన్నారు. బాల్య వివాహ రహిత తెలంగాణ కోసం ప్రభుత్వం, స్థానిక సంస్థలు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

